www.hamsakalam.com
PRGI: TGTEL/26/A3129
సంచలన తెలుగు దినపత్రిక
హంస కలం వార్త
HAMSA KALAM VARTA
చీఫ్ ఎడిటర్: వడ్ల మధుసూదన్ చారి
EDITOR :VADLA MADHUSUDHAN CHARY MEDCHAL /MALKAJGIRI VOLUME:1 ISSUE:4 TUESDAY , JUNE 2,2026 PAGES:8 COST: 4 /-
ఎడిటర్ : వడ్ల మధుసూదన చారి మేడ్చల్ /మల్కాజిగిరి సంపుటి : 1 సంచిక : 4 మంగళవారం 2 జూన్ 2026 పేజీలు :8 వెల: 4/-



# హైదరాబాద్ సభపై పవన్ కల్యాణ్‌కు పొన్నం ప్రభాకర్ అల్టిమేటం..

**హైదరాబాద్‌లో జనసేన 'నవనిర్మాణ సభ'**

**తెలంగాణ ఏర్పాటును పవన్ తీవ్రంగా వ్యతిరేకించారన్న పొన్నం**

**హైదరాబాద్‌లోనే పవన్ ఎందుకు సభ పెడుతున్నారని ప్రశ్న**



**క్షమాపణ చెప్పాకే అడుగుపెట్టాలని**

**డిమాండ్!**

హంసకలం వార్త: హైదరాబాద్‌లో జనసేన అధినేత, ఏపీ పవన్ కల్యాణ్ నిర్వహించ తలపెట్టిన 'నవనిర్మాణ సభ'పై తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించిన ఆయన.. పవన్ కల్యాణ్ తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పిన తర్వాతే ఇక్కడ సభ పెట్టుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటును గతంలో పవన్ కల్యాణ్ తీవ్రంగా వ్యతిరేకించారని మంత్రి పొన్నం గుర్తుచేశారు. రాష్ట్రం ఏర్పడినప్పుడు తాను 11 రోజుల పాటు అన్నం ముట్టలేదని పవన్ చెప్పిన విషయాలను ప్రస్తావిస్తూ... అసలు ఏ నైతిక హక్కుతో ఆయన హైదరాబాద్‌లో ఇంత పెద్ద బహిరంగ సభను నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. 2లో..

## నెల రోజుల్లోనే ఇందిరమ్మ ఇల్లు కట్టుకునేలా కొత్త సాంకేతికత తీసుకువస్తాం



**కొమురంబీమ్ జిల్లాలో సీఎం పర్యటన**

**కొరాటి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ళ గృహప్రవేశంలో పాల్గొన్న సీఎం**

**రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవానికి పైలాన్ ఆవిష్కరణ**

హంసకలం వార్త: నెల రోజుల్లోనే ఇందిరమ్మ ఇల్లు కట్టుకునేలా కొత్త సాంకేతికతను తీసుకువస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కొమురంబీమ్ అసిఫాబాద్ జిల్లాలో ముఖ్యమంత్రి ఈరోజు పర్యటించారు. కోరాటి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశంలో పాల్గొన్నారు. -2లో..

## పవన్ కల్యాణ్ హైదరాబాద్ సభకు బ్రేక్..



- హైదరాబాద్‌లో పవన్ కల్యాణ్ సభకు అనుమతి నిరాకరణ
- జూన్ 2న ఆవిర్భావ వేడుకల దృష్ట్యా భద్రతా కారణాలు చూపిన పోలీసులు
- 'జనసేన సాధక్ సమ్మేళనం' పేరుతో సభకు ప్రణాళిక
- ఈ సభపై తెలంగాణలో కొనసాగుతున్న రాజకీయ చర్చ

హంసకలం వార్త: హైదరాబాద్‌లో జనసేన పార్టీ రేపు నిర్వహించ తలపెట్టిన నవనిర్మాణ సభకు సైబరాబాద్ పోలీసులు అనుమతి నిరాకరించారు. జూన్ 2వ తేదీన గచ్చిబౌలిలోని సంధ్యా కన్వెన్షన్‌లో 'జనసేన సాధక్' (యాక్టివ్ సభ్యులు) సమావేశం నిర్వహించాలనుకున్నారు. సుమారు 2,000 మంది పార్టీ కార్యకర్తలు హాజరవుతారని అంచనా వేసిన ఈ సమావేశానికి అనుమతిని తిరస్కరిస్తున్నట్లు -2లో..

## తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం అసాధ్యం



-మతపరమైన విభజనపై బీజేపీ నిలబడి ఉందన్న కూనంనేని

-తెలంగాణలో జైత్రయాత్ర చేయబోతున్నామని ఆ పార్టీ నేతలు గొప్పలు చెప్పుకుంటున్నారని ఎద్దేవా

-ప్రజా సమస్యలపై పోరాటాలు చేయాలని సీపీఐ శ్రేణులకు పిలుపు

## కొత్త నాయకత్వం కోసం కాంగ్రెస్ 'టాలెంట్ హంట్'

**యువతకు మహేష్ కుమార్ గౌడ్ పిలుపు**



-సమర్థులైన, చదువుకున్న యువతను ఆకర్షించేందుకు కాంగ్రెస్ కొత్త కార్యక్రమం

-రాజకీయ నేపథ్యం లేని యువతకు సువర్ణావకాశమన్న మహేశ్ గౌడ్

-టాలెంట్ ఉన్న వారిని ఎంపిక చేస్తామన్న పీసీసీ చీఫ్

హంసకలం వార్త: రాజకీయాల్లోకి సమర్థులైన, చదువుకున్న యువతను ఆకర్షించేందుకు తెలంగాణ కాంగ్రెస్ ఒక సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 2లో..

## ఎందుకు ఈ నిర్లక్ష్యం?

**రేవంత్ ప్రభుత్వానికి రాంచందర్ రావు ప్రశ్న**



-ధాన్యం కొనుగోళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమయిందన్న రాంచందర్ రావు

-ధాన్యం పేరుకుపోయి రైతులు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన

-బీజేపీ ఆందోళనలతో ప్రభుత్వం కొంత కదిలిందని వ్యాఖ్య

హంసకలం వార్త: తెలంగాణలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, రైస్ మిల్లర్లతో కుమ్మక్కైందని తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఢిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన.. రాష్ట్రంలో కొనుగోళ్లు సాగుతున్న తీరుపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. "చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని నాడు రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. మరి ఇప్పుడెందుకు ఈ నిర్లక్ష్యం?" అని రాంచందర్ రావు ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా రోడ్లపైనే ధాన్యం కుప్పలు తెప్పలుగా పేరుకుపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే కొనుగోళ్లను ఆలస్యం చేస్తోందని, దిగుబడికి సంబంధించిన సరైన గణాంకాలను కూడా కేంద్ర 2లో..

## పారదర్శకతే లక్ష్యం.. టీజీపీఎస్సీలో కీలక సంస్కరణలు

**టీజీపీఎస్సీలో ఇకపై అన్ని పరీక్షలు కంప్యూటర్ ఆధారితంగానే**

**ఓఎంఆర్ కంటే కంప్యూటర్ విధానమే అత్యంత సురక్షితం అన్న చైర్మన్**

**పరీక్షకు గంట ముందు కూడా ప్రశ్నపత్రం తయారు చేయవచ్చని వెల్లడి**

**పారదర్శకత కోసం ప్రతి 2-3 నెలలకు మీడియా సమావేశం ఏర్పాటు**

**అందరికీ ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వడం సాధ్యం కాదని వ్యాఖ్య**

హంసకలం వార్త: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) నిర్వహించే అన్ని నియామక పరీక్షలను ఇకపై కంప్యూటర్ ఆధారిత విధానంలోనే (సీబీటీ) నిర్వహిస్తామని చైర్మన్ బుర్రా వెంకటేశం స్పష్టం చేశారు. ఈ విధానం ద్వారా నియామక ప్రక్రియలో మరింత భద్రత, పారదర్శకత సాధ్యమవుతుందని అన్నారు. శాంతిభద్రతల సమస్యలు, -2లో..



## జూలై నెలాఖరులోపు మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పూర్తి చేయాలి

**మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

హంసకలం వార్త: మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులను రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, జిల్లా కలెక్టర్ అంకిత్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠలతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, జూన్ నాటికి పూర్తికావాల్సిన పనులు ఇప్పటికీ ఎందుకు పూర్తికాలేదని అధికారులను ప్రశ్నించారు. పనుల ఆలస్యానికి గల కారణాలను అడిగి తెలుసుకుని, -2లో..

హంస కలం వార్త HAMSA KALAM VARTA
మంగళవారం 2 జూన్ 2026

## నెల రోజుల్లోనే ఇందిరమ్మ ఇల్లు కట్టుకునేలా కొత్త సాంకేతికత తీసుకువస్తాం

నెల రోజుల్లోనే ఇందిరమ్మ ఇల్లు కట్టుకునేలా కొత్త సాంకేతికతను తీసుకువస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కొమురంబీమ్ అసిఫాబాద్ జిల్లాలో ముఖ్యమంత్రి ఈరోజు పర్యటించారు. కోతారి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశంలో పాల్గొన్నారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవానికి పైలాన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, అర్హులైన వారందరూ ఇళ్లను నిర్మించుకోవాలని అన్నారు. నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున మొదటి విడతలో 4 లక్షల 50 వేల ఇళ్లను ఇచ్చినట్లు చెప్పారు. త్వరలో రాష్ట్రం మొత్తంలో ప్రారంభించే ఇళ్లకు ఆదివాసీ ప్రాంతం నుంచే లక్ష ఇళ్లను ప్రారంభిస్తామని అన్నారు.

## పారదర్శకతే లక్ష్యం.. టీజీపీఎస్సీలో కీలక సంస్కరణలు

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) నిర్వహించే అన్ని నియామక పరీక్షలను ఇకపై కంప్యూటర్ ఆధారిత విధానంలోనే (సీబీటీ) నిర్వహిస్తామని చైర్మన్ బుర్రా వెంకటేశం స్పష్టం చేశారు. ఈ విధానం ద్వారా నియామక ప్రక్రియలో మరింత భద్రత, పారదర్శకత సాధ్యమవుతుందని అన్నారు. సోమవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. "ప్రస్తుత పరిస్థితుల్లో నియామక పరీక్షల నిర్వహణకు కంప్యూటర్ ఆధారిత విధానమే అత్యుత్తమ మార్గం. సంప్రదాయ ఓఎంఆర్ విధానంతో పోలిస్తే ఇది ఎంతో సురక్షితమైనది. పరీక్షకు గంట ముందు కూడా ప్రశ్నపత్రాన్ని సిద్ధం చేసే వెసులుబాటు ఉంటుంది" అని వివరించారు. కమిషన్‌లో అనేక సంస్కరణలు ప్రవేశపెడుతున్నామని, అభ్యర్థుల్లో విశ్వాసం నింపేందుకు సాంకేతికతను వాడుకుంటున్నామని తెలిపారు. అందరికీ ప్రభుత్వ ఉద్యోగాలివ్వడం సాధ్యం కాదని, అందుకే పోటీ పరీక్షల్లో కొందరికి నిరాశ తప్పదని ఆయన అన్నారు. కమిషన్‌పై వచ్చే నిరాధార విమర్శలను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. పారదర్శకతను పెంచే ఉద్దేశంతో ఇకపై ప్రతి రెండు, మూడు నెలలకు ఒకసారి మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడిస్తామని ప్రకటించారు.

## తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం అసాధ్యం

సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు బీజేపీపై ధ్వజమెత్తారు. ఆ పార్టీ మతపరమైన విభజన, మతం అనే సౌధంపై నిలబడి ఉందని తీవ్రంగా విమర్శించారు. హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో బీజేపీ దండయాత్ర, జైత్రయాత్ర చేయబోతోందంటూ ఆ పార్టీ నాయకులు గొప్పలు చెప్పుకుంటున్నారని, అయితే ఇక్కడ వారు కొన్ని సీట్లు గెలవొచ్చేమో కానీ అధికారంలోకి రావడం మాత్రం అసాధ్యమని ఆయన స్పష్టం చేశారు. దేశంలోనూ, రాష్ట్రంలోనూ ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని, అందువల్ల సీపీఐ శ్రేణులు ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల వ్యూహాన్ని ప్రకటిస్తూ, పొత్తులు ఉంటే కనీసం 5 స్థానాల్లో, లేనిపక్షంలో కనీసం 15 నియోజకవర్గాల్లో పోటీ చేసేలా పార్టీ సన్నద్ధం కావాలని కూనంనేని పేర్కొన్నారు. ఇందులో భాగంగా రాష్ట్రంలో బలమైన 40 నియో జకవర్గాలను గుర్తించామని, అక్కడ ఆగస్టు 6 నుంచి 15 వరకు ప్రత్యేక పాదయాత్రలు చేపడతామని వెల్లడించారు. ఈ యాత్రల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలతో పాటు స్థానిక సమస్యలను ప్రజల ముందుకు తీసుకెళ్తామన్నారు. అలాగే ప్రొఫెసర్ నాగేశ్వర్‌పై జరుగుతున్న వేధింపులకు వ్యతిరేకంగా జూన్ 4న, ఓటరు జాబితా ప్రత్యేక సవరణపై జూన్ 15న ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయని, సెప్టెంబర్ 28న 'ఛలో ఢిల్లీ' కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆయన ప్రకటించారు.

## తెలంగాణ ఆవిర్భావ దినోత్సం సందర్భంగా పోలీసులకు పతకాలు

హంసకలం వార్త జూన్ 01

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా, ఉత్తమ సేవలు అందించిన 632 మంది పోలీసులు, అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం పతకాలను ప్రకటించింది. ఈ మేరకు ఈరోజు వారి పేర్లను ప్రకటించింది. విశిష్ఠ, అత్యుత్తమ మరియు ఉత్తమ సేవలకు గుర్తింపుగా, పోలీస్, విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, అవినీతి నిరోధక బ్యూరో, ప్రత్యేక రక్షణ దళం, అగ్నిమాపక సేవల విభాగాలకు చెందిన సిబ్బందిని వివిధ పతకాలకు ఎంపిక చేశారు. తెలంగాణ రాష్ట్ర విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ చీఫ్ ప్రతాప్‌కు సీఎం సర్వోన్నత పోలీసు పతకం దక్కింది. భద్రాద్రి కొత్తగూడెం రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ రవి, చెర్ల సీఐ రాజులకు తెలంగాణ పోలీస్ శౌర్య పతకాలను ప్రకటించారు. ఇంటెలిజెన్స్ కానిస్టేబుల్ సంపత్, గ్రేహౌండ్స్‌లోని మరో ఏడుగురిని శౌర్య పతకాలు వరించాయి. 16 మందికి మహోన్నత సేవా పతకాలు, 94 మందికి ఉత్తమ సేవా పతకాలు, 50 మంది కఠిన సేవా పతకాలు, మరో 461 మంది సేవా పతకాలు అందుకోనున్నారు.

## హైదరాబాద్ సభపై పవన్ కల్యాణ్‌కు పొన్నం ప్రభాకర్ అల్టిమేటం..

హైదరాబాద్‌లో జనసేన అధినేత, ఏపీ పవన్ కల్యాణ్ నిర్వహించ తలపెట్టిన 'నవనిర్మాణ సభ'పై తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించిన ఆయన.. పవన్ కల్యాణ్ తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పిన తర్వాతే ఇక్కడ సభ పెట్టుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటును గతంలో పవన్ కల్యాణ్ తీవ్రంగా వ్యతిరేకించారని మంత్రి పొన్నం గుర్తుచేశారు. రాష్ట్రం ఏర్పడినప్పుడు తాను 11 రోజుల పాటు అన్నం ముట్టలేదని పవన్ చెప్పిన విషయాలను ప్రస్తావిస్తూ... అసలు ఏ నైతిక హక్కుతో ఆయన హైదరాబాద్‌లో ఇంత పెద్ద బహిరంగ సభను నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. "తెలంగాణ దృష్టి పడితే కోనసీమలో కొబ్బరి చెట్లు ఎండిపోతాయి" అంటూ గతంలో పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, భావాలను తీవ్రంగా గాయపరిచాయని పొన్నం మండిపడ్డారు. ఈ వ్యాఖ్యలపై పవన్ సమాధానం చెప్పి తీరాలన్నారు. తెలంగాణలో రాజకీయ ప్రయోజనాల కోసం, ఇక్కడి ప్రజల మధ్య విభేదాలు సృష్టించి ద్వేషాన్ని నింపేందుకు పవన్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. దీని వెనుక బీజేపీతో పవన్‌కు ఉన్న 'తెరవెనుక ఒప్పందం' స్పష్టంగా కనిపిస్తోందని విమర్శించారు. ఈ సభ నిజంగా అభివృద్ధి కోసమే అయితే గుజరాత్, ఉత్తర ప్రదేశ్, తమిళనాడు లేదా కేరళలో పెట్టుకోవచ్చు కదా... కేవలం హైదరాబాద్‌లోనే ఎందుకు పెడుతున్నారని మంత్రి ప్రశ్నించారు. ఏపీ ప్రజలు పవన్‌కు బాధ్యతాయుతమైన పదవి ఇచ్చారని, తెలంగాణ రాజకీయాల్లో జోక్యం చేసుకోకుండా... వైజాగ్ స్టీల్ ప్లాంట్ వంటి ఆంధ్రప్రదేశ్ సమస్యలపై దృష్టి పెడితే మంచిదని హితవు పలికారు. పవన్ గనుక క్షమాపణ చెప్పకపోతే తెలంగాణ ప్రజలు ఈ సభను తీవ్రంగా వ్యతిరేకిస్తారని హెచ్చరించారు.

## కొత్త నాయకత్వం కోసం కాంగ్రెస్ 'టాలెంట్ హంట్'

రాజకీయాల్లోకి సమర్థులైన, చదువుకున్న యువతను ఆకర్షించేందుకు తెలంగాణ కాంగ్రెస్ ఒక సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సోమవారం గాంధీ భవన్‌లో పార్టీ తరఫున వినూత్నమైన 'టాలెంట్ హంట్' ప్రోగ్రామ్‌ను అధికారికంగా ప్రకటించారు. ప్రజా జీవితంలోకి రావాలనుకునే ప్రతిభావంతులైన యువతీ యువకులకు కాంగ్రెస్ పార్టీ ఒక సువర్ణావకాశాన్ని కల్పిస్తోందని, దేశ నిర్మాణంలో యువత ప్రధాన పాత్ర పోషించాలనే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆలోచనల నుంచే ఈ కార్యక్రమం రూపుదిద్దుకుందని ఆయన ఈ సందర్భంగా వివరించారు. ఇది సాధారణ పార్టీ చేరికల లాంటి కార్యక్రమం కాదని, సమాజానికి సేవ చేయాలనే తపన ఉన్న ప్రతి ఒక్కరినీ వారి రాజకీయ నేపథ్యంతో సంబంధం లేకుండా ఆహ్వానిస్తున్నామని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. ఈ టాలెంట్ హంట్ ద్వారా పార్టీ అధికారిక ప్రతినిధులను పూర్తిగా పారదర్శకమైన పద్ధతిలో ఎంపిక చేయనున్నారు. జాతీయ, రాష్ట్ర రాజకీయ వ్యవహారాలపై బలమైన అవగాహన ఉండటం, లౌకికవాదం పట్ల పూర్తి నిబద్ధత కలిగి ఉండటం, సామాజిక సేవపై నిజమైన ఆసక్తితో పాటు ప్రజలతో సమర్థవంతంగా మాట్లాడగలిగే నైపుణ్యం ఉన్నవారిని ఈ ప్రక్రియ ద్వారా ఎంపిక చేస్తారు. సాంప్రదాయ రాజకీయ సంబంధాలు లేకపోయినా కేవలం ప్రతిభ, స్పష్టమైన విజన్, సేవా దృక్పథం ఉన్న మంచి వ్యక్తుల కోసం కాంగ్రెస్ పార్టీ ఈ వేదికను అందిస్తోందని టీపీసీసీ చీఫ్ స్పష్టం చేశారు. వారసత్వ రాజకీయాలకు భిన్నంగా, క్షేత్రస్థాయి నుంచి సరికొత్త రక్తాన్ని పార్టీలోకి ఆహ్వానించడానికి కాంగ్రెస్ వేసిన ఈ అడుగు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆశావహ యువతలో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది.

# పవన్ కల్యాణ్ హైదరాబాద్ సభకు బ్రేక్

హైదరాబాద్‌లో జనసేన పార్టీ రేపు నిర్వహించ తలపెట్టిన నవనిర్మాణ సభకు సైబరాబాద్ పోలీసులు అనుమతి నిరాకరించారు. జూన్ 2వ తేదీన గచ్చిబౌలిలోని సంధ్యా కన్వెన్షన్‌లో 'జనసేన సాధక్' (యాక్టివ్ సభ్యులు) సమావేశం నిర్వహించాలనుకున్నారు. సుమారు 2,000 మంది పార్టీ కార్యకర్తలు హాజరవుతారని అంచనా వేసిన ఈ సమావేశానికి అనుమతిని తిరస్కరిస్తున్నట్లు సెరిలింగంపల్లి జోన్ డీసీపీ కార్యాలయం సోమవారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. శాంతిభద్రతల సమస్యలు, స్థానిక ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పోలీసులు తమ ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నారు. ఇటీవల ప్రొఫెసర్ కె. నాగేశ్వర్‌పై ఆంధ్రప్రదేశ్‌లో క్రిమినల్ కేసులు నమోదు కావడం, ఆ తర్వాత ఏపీకి చెందిన జనసేన సహా కొందరు రాజకీయ నేతలు చేసిన వ్యాఖ్యలు తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీశాయని పోలీసులు తెలిపారు. ఈ పరిణామాల వల్ల తెలంగాణలోని విద్యార్థి సంఘాలు, ఇతర బృందాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని, రాష్ట్రంలో ఉద్రిక్త వాతావరణం నెలకొందని వివరించారు.దఅంతేకాకుండా, జూన్ 2వ తేదీ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం కావడంతో ఈ సమయంలో సమావేశం నిర్వహించడం సమంజసం కాదని పోలీసులు అభిప్రాయపడ్డారు. ఈ పరిస్థితుల్లో సభ నిర్వహిస్తే శాంతిభద్రతలకు తీవ్ర విఘాతం కలిగే అవకాశం ఉందని, నిరసనలు, ఆందోళనలు జరిగి ట్రాఫిక్‌కు అంతరాయం కలగవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. వీటితో పాటు, సమావేశం జరగాల్సిన సంధ్యా కన్వెన్షన్‌కు తగినంత పార్కింగ్ సౌకర్యం లేదని విచారణలో తేలిందని పోలీసులు పేర్కొన్నారు. నిర్వాహకులు పార్కింగ్ కోసం ప్రతిపాదించిన ఎఫ్‌సీఐ సొసైటీ లేఅవుట్‌కు సంబంధించిన స్థలంపై న్యాయపరమైన వివాదాలు ఉన్నాయని, ఆ స్థలంపై గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో మూడు క్రిమినల్ కేసులు కూడా పెండింగ్‌లో ఉన్నాయని తమ ఉత్తర్వుల్లో వివరించారు. ఈ కారణాలన్నింటినీ దృష్టిలో ఉంచుకుని, ప్రజా శాంతికి భంగం కలగకూడదనే ఉద్దేశంతో సమావేశానికి అనుమతి నిరాకరిస్తున్నట్లు డీసీపీ తెలిపారు. జనసేన పార్టీ జనరల్ సెక్రటరీ తాళ్లూరి రామ్ ఈ సమావేశం కోసం మే 29న పోలీసులకు దరఖాస్తు చేసుకున్నారు.

## జూలై నెలాఖరులోపు మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పూర్తి చేయాలి



మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులను రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, జిల్లా కలెక్టర్ అంకిత్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠలతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి పనుల పురోగతిని సమీక్షించారు.దఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, జూన్ నాటికి పూర్తికావాల్సిన పనులు ఇప్పటికీ ఎందుకు పూర్తికాలేదని అధికారులను ప్రశ్నించారు. పనుల ఆలస్యానికి గల కారణాలను అడిగి తెలుసుకుని, నిర్దేశిత గడువుల్లో పనులు పూర్తి కాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించి పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేయాలని, జూలై నెలాఖరులోపు మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులను పూర్తిచేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. పినపాక నియోజకవర్గ రైతులే సీతారామ ఎత్తిపోతల పథకం కోసం తొలుత భూములు అందించారని గుర్తుచేసిన మంత్రి, ఈ ప్రాజెక్టు ద్వారా మొదటగా పినపాక నియోజకవర్గ రైతులకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, సాగునీటి వసతుల కల్పన ద్వారా వ్యవసాయాభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. సీతారామ ఎత్తిపోతల పథకం నిర్మాణానికి ఇప్పటివరకు రూ.10 వేల కోట్లు వ్యయం చేసినట్లు మంత్రి తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయిలో రైతులకు ప్రయోజనం చేకూర్చాలంటే ఇంకా రూ.9 వేల కోట్ల నిధులు అవసరమవుతాయని చెప్పారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చొరవతో డిస్ట్రిబ్యూటరీ కాలువల నిర్మాణ పనుల కోసం ఇప్పటికే రూ.4 వేల కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రజా ప్రతినిధులు అధికారులు సమన్వయంతో డిస్ట్రిబ్యూటరీ కాలువల నిర్మాణం, భూసేకరణ ప్రక్రియలను వేగవంతంగా పూర్తి చేస్తే వచ్చే ఏడాది నాటికి పినపాక, అశ్వారావుపేట, కొత్తగూడెం, సత్తుపల్లి, మధిర నియోజకవర్గాలకు సాగునీరు అందించే అవకాశం ఉంటుందని అన్నారు . ఖమ్మం జిల్లాకు చెందిన సుమారు ఏడున్నర లక్షల ఎకరాలకు సాగునీరు అందించే సీతమ్మసాగర్ ప్రాజెక్టుకు సంబంధించి సుప్రీంకోర్టు అనుమతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సీతమ్మసాగర్ ప్రాజెక్టు పూర్తయితే 38 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం అందుబాటులోకి వచ్చి, ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు మహబూబాబాద్ జిల్లాలోని విస్తారమైన ఆయకట్టుకు సాగునీరు అందించగలమని తెలిపారు. సీతారామ ఎత్తిపోతల పథకం ప్రధాన కాలువను ప్రారంభ స్థానం నుంచి చివరి వరకు పూర్తిస్థాయిలో శుభ్రపరచాలని అధికారులను ఆదేశించారు. కాలువల్లో ఎక్కడైనా మట్టి పేరుకుపోయిన ప్రాంతాలు, జారిన గట్లు లేదా ఇతర అవరోధాలు ఉంటే వెంటనే తొలగించి నీటి ప్రవాహానికి ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. రానున్న వర్షాకాలంలో నీటి విడుదలకు ముందే కాలువలు పూర్తిగా సిద్ధంగా ఉండేలా నిర్వహణ పనులను వేగవంతం చేయాలని, రైతులకు సాగునీరు సకాలంలో అందేలా ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మగ్రి సంధ్యా సంబంధిత శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఎందుకు ఈ నిర్లక్ష్యం?: రేవంత్ ప్రభుత్వానికి రాంచందర్ రావు ప్రశ్న


తెలంగాణలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, రైస్ మిల్లర్లతో కుమ్మక్కైందని తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఢిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన.. రాష్ట్రంలో కొనుగోళ్లు సాగుతున్న తీరుపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. "చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని నాడు రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. మరి ఇప్పుడెందుకు ఈ నిర్లక్ష్యం?" అని రాంచందర్ రావు ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా రోడ్లపైనే ధాన్యం కుప్పలు తెప్పలుగా పేరుకుపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే కొనుగోళ్లను ఆలస్యం చేస్తోందని, దిగుబడికి సంబంధించిన సరైన గణాంకాలను కూడా కేంద్ర ప్రభుత్వానికి పంపడంలో విఫలమైందని ఆరోపించారు. రాష్ట్రాలు సేకరించిన ధాన్యానికి మాత్రమే కేంద్రం నిధులు రీయింబర్స్ చేస్తుందని, కానీ రాష్ట్ర ప్రభుత్వ అలసత్వం వల్లే రైతులకు ఈ దుస్థితి దాపురించిందని గుర్తుచేశారు. ధాన్యం తరలింపులో జరుగుతున్న జాప్యంపై బీజేపీ చేసిన ఆందోళనలను ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. బీజేపీ నిరంతరాయంగా చేసిన నిరసనలు, పోరాటాల వల్లే ఎట్టకేలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలకు లారీలను పంపించాల్సి వచ్చిందని అన్నారు. బీజేపీ ఒత్తిడి వల్లే కాంగ్రెస్ ప్రభుత్వం అంతో ఇంతో కదిలిందని చెప్పారు. రైతుల వద్ద మిగిలి ఉన్న ప్రతి ధాన్యం గింజను ఎలాంటి ఆలస్యం లేకుండా తక్షణమే యుద్ధప్రాతిపదికన కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇదే సమావేశంలో రేపు (జూన్ 2న) ఢిల్లీలో బీజేపీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు రాంచందర్ రావు ప్రకటించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ గడ్కరీతో పాటు పలువురు కేంద్ర సీనియర్ నాయకులు హాజరుకానున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా పార్టీ జాతీయ నాయకత్వం ఇప్పుడు తెలంగాణపై ప్రత్యేక దృష్టి సారించిందని ఆయన స్పష్టం చేశారు.

# సంపాదకీయం

## అవార్డుల ఆర్బాటమే తప్ప సాంస్కృతిక నిర్మాణమేదీ

పన్నెండేళ్ళ క్రితం జరిగిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన కేవలం రాజకీయ పటాన్ని మాత్రమే మార్చలేదు. అది తెలుగు సమాజ భాషా సాంస్కృతిక మానసిక స్థితిని కూడా విభజించింది. రెంటినీ రెండువైపులా భిన్నమైన వేర్వేరు దారుల్లో నడిపించింది. యాసలు వేరయినా ఒకే భాష మాట్లాడే ప్రజలు రెండు రాష్ట్రాలుగా విడిపోయిన తర్వాత, వారి సాహిత్యం, సంస్కృతి, కళా దృక్పథాలు కూడా కొత్త రూపాల్ని సంతరించుకున్నాయి. ప్రత్యేక రాష్ట్ర పోరాట కాలం నుంచి తెలంగాణలో 'అస్తిత్వం' ప్రధాన ప్రశ్నగా మారితే, విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో 'పునర్నిర్మాణం' ప్రధాన ఆందోళనగా నిలిచింది. ఈ రెండు దశ దిశల ప్రభావం సాహితీ సాంస్కృతిక రంగాలపై స్పష్టంగా పడింది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం ఒక దీర్ఘకాల ఉద్యమ ఫలితం. ఆ ఉద్యమానికి మూలశక్తి కేవలం రాజకీయ నాయకత్వం కాదు. పాట, కవిత, జానపదం, కథ, వీధి నాటకం, ప్రజాగీతం తదితర సాంస్కృతిక రూపాలు కూడా అత్యంత ప్రధానమైన భూమిక పోషించాయి. ఎందరో కవులు గాయకులూ పాడిన గీతాలు, దళిత బహుజన రచయితల స్వరాలు ఇవన్నీ తెలంగాణ ఉద్యమాన్ని ప్రజల గుండెల్లో నిలిపాయి. అందుకే రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ ప్రభుత్వం ముందుగా గుర్తించింది ఆడి పాడిన సాంస్కృతిక బృందాలనే. తర్వాత తెలంగాణ భాషా సంస్కృతి శాఖ పరిమితంగా పనిచేయడం, తెలంగాణ సాహిత్య అకాడమీ ఏర్పాటవడం, ప్రపంచ తెలుగు మహాసభల నిర్వహణ, పునాస పత్రికప్రచురణ తెలంగాణా సాహిత్యానికి ఆశాజనకమైన సందర??భాలు. ఆ తర్వాతి కాలంలో కాళోజీ, దాశరథి, సినారె, గద్దర్ వంటి మహనీయుల పేర్లతో అవార్డులు ప్రకటించడం ఇవన్నీ ఒక సాంస్కృతిక ప్రకటనలాగే కనిపించాయి. కాళోజీ అవార్డు తెలంగాణ ప్రజాస్వభావానికి ప్రతీకగానూ, దాశరథి అవార్డు ఉద్యమ కవిత్వానికి గౌరవ సూచికగానూ భావించారు. గద్దర్ పేరిట సినీ పురస్కారాలను ప్రవేశపెట్టడం కూడా సాధారణ పరిపాలనా చర్య కాదు. దాన్ని తెలంగాణ తన సాంస్కృతిక స్వరూపాన్ని ప్రత్యేకంగా చాటుకోవాలన్న ప్రయత్నంగానే చూడాలి. బతుకమ్మ, బోనాలు వంటి పండుగలను అధికారిక రాష్ట్రోత్సవాలుగా మలచడం ద్వారా జానపద సంస్కృతికి రాజకీయ గుర్తింపు, వేదిక లభించాయి. అయితే ప్రశ్న ఇక్కడే మొదలవుతుంది. ఈ అవార్డులు, ఉత్సవాలు, సభలు నిజంగా సాహిత్య సాంస్కృతిక రంగాన్ని లోతుగా బలపరిచాయా? లేక ప్రతీకాత్మక సత్కారాలకే పరిమితమయ్యాయా? మరోవైపు అనేకమంది సాహితీ వేత్తలు సాంస్కృతిక సృజనకారులు అవార్డులకోసం పదవులకోసం మంత్రుల చుట్టూ వారి తాబేదార్లచుట్టూ అధికారాల పీఠాల చుట్టూ ప్రదక్షిణలు చేసే మహాపాదచారులుగా మారిపోయారు. తెలంగాణ ఉద్యమ కాలంలో కనిపించిన ప్రతిఘటనాత్మక సాహితీ సాంస్కృతిక శక్తి రాష్ట్రం ఏర్పడ్డాక కొంతవరకు ప్రభుత్వ వ్యవస్థలో కలిసిపోయిందన్న విమర్శ వినిపిస్తూనే వుంది. ఉద్యమ గీతాలు శ్రుతులు మారి అధికార వేదికలపై వినిపించాయి. అదే సమయంలో విమర్శనాత్మక స్వరం బలహీనపడింది. అకాడమీ ఏర్పడ్డా పరిశోధనాత్మక సాహిత్య నిర్మాణం, ఆధునిక సాంకేతికతను సంతరించుకుని దృశ్యమాధ్యమాన్ని సాహిత్యంతో మేళవించడంలో విఫలమైంది. పరిశీలిస్తే ప్రజా ఉద్యమ సంస్కృతి క్రమంగా అధికార సంస్కృతిగా మారిన వైనం కనిపిస్తుంది. అయినా తెలంగాణలో ఒక ముఖ్యమైన మార్పు మాత్రం స్పష్టంగా కనిపించింది. అధికారికంగా ప్రత్యేక దృష్టి, ప్రయత్నాలు లేకున్నా తెలంగాణ భాషకు గౌరవం పెరిగింది. ఒకప్పుడు యాసగా 'స్లాంగ్'గా కొట్టిపారేసిన పలుకుబడులు ఇప్పుడు సాహిత్యంలో, సినిమాల్లో, టెలివిజన్‌లో ప్రధాన ప్రవాహంగా మారాయి. దళిత, బీసీ, గిరిజన, ముస్లిం రచయితలకు కొత్త వేదికలు లభించాయి. గ్రామీణ జీవితానుభవాలు సాహిత్యంలో మరింత బలంగా ప్రతిఫలించాయి. యూట్యూబ్, డిజిటల్ మీడియా ద్వారా ప్రజాగీతాలు కొత్త తరానికి చేరాయి. ఇది తెలంగాణ సాంస్కృతిక క్రమంలో నిర్లక్ష్యం చేయలేని మార్పు. ఆంధ్రప్రదేశ్ పరిస్థితి మాత్రం దీనికి పూర్తి భిన్నం. విభజన తర్వాత ఈ రాష్ట్రం రాజధాని నిర్మాణం, ఆర్థిక లోటు, పరిపాలనా పునర్వ్యవస్థీకరణ వంటి అంశాల్లో మునిగిపోయింది. ఆ కారణంగా సాహిత్య సాంస్కృతిక రంగం ప్రభుత్వ ప్రాధాన్యతల్లో వెనుకబడింది. ఒకరకంగా వాటికి ఎలాంటి ప్రాధాన్యత లేకుండానే పోయింది. కళారత్న, ఉగాది పురస్కారాలు వంటి సంప్రదాయ సత్కారాలు కొనసాగినా, అవి ఒక స్పష్టమైన సాంస్కృతిక దిశను ప్రతిబింబించలేకపోయాయి. ఆంధ్రప్రదేశ్‌లో ప్రధాన సమస్య 'సాంస్కృతిక విజన్' లోపం. తెలంగాణలోలాగా ప్రత్యేక అస్తిత్వ రాజకీయాల నేపథ్యం లేకపోవడంవల్ల అక్కడ కొత్త ప్రాంతీయ సాహిత్యోద్యమం పెద్దగా కనిపించలేదు. సాహిత్య రంగం ఎక్కువగా వ్యక్తిగత రచయితల కృషి, ప్రైవేట్ సాహిత్య సంస్థలు, చిన్న ప్రచురణకర్తలు, డిజిటల్ వేదికలపై ఆధారపడింది. ప్రభుత్వ ఆధ్వర్యంలో దీర్ఘకాలిక సాంస్కృతిక సంస్థల నిర్మాణం జరగలేదు. రెండు రాష్ట్రాల పరిస్థితిని పరిశీలిస్తే ఒక ఉమ్మడి లోటు స్పష్టంగా కనిపిస్తుంది: శాశ్వత సాంస్కృతిక మౌలిక వసతుల కొరత. ప్రపంచ స్థాయి తెలుగు సాహిత్య ఆర్కైవ్స్, డిజిటల్ పుస్తక భాండాగారాలు, రచయితల ఫెలోషిప్‌లు, అనువాద అకాడమీలు, ప్రజా కళల పరిశోధన కేంద్రాలు, బాలసాహిత్య మ్యూజియంలు వంటి దీర్ఘకాలిక ప్రణాళికలు ఇంకా కలలుగానే మిగిలిపోయాయి. రెండు రాష్ట్రాల్లోనూ భోపాల్‌లోని 'భారత్ భవన్', కలకత్తాలోని 'నందన్' లాంటి కేంద్రాల్ని నిర్మించుకోలేకపోవడం దురదృష్టమే. అవార్డులు ప్రకటించడం సులభం కానీ సృజనాత్మక సమాజ నిర్మాణం కోసం అవసరమైన మౌలిక వ్యవస్థలను నెలకొల్పడం కష్టం. అదే రెండు రాష్ట్రాల్లోనూ పూర్తిగా సాధ్యపడలేదు. ఒకరకంగా మొదలే అవలేదు. అయితే ఆశాజనకమైన అంశం ఏమిటంటే, ప్రభుత్వాలకంటే బయట కొత్త స్వచ్ఛంద సాహిత్య చైతన్యం పెరుగుతోంది. దళిత బహుజన రచయితల వేదికలు, మహిళా రచయితల సమూహాలు, స్వతంత్ర ప్రచురణ సంస్థలు, చిన్న పత్రికలు, యూట్యూబ్ సాహిత్య చానెల్లు, డిజిటల్ పఠన వేదికలు కొత్త తరం సాహిత్యాన్ని ముందుకు తీసుకువస్తున్నాయి. తెలంగాణలో ప్రజాగీతాల కొత్త తరంగం కనిపిస్తుంటే, ఆంధ్రాలో యువ కవిత్వం, స్వీయ ప్రచురణ ధోరణి పెరుగుతోంది. అయితే చివరికి ఒక ప్రశ్న మిగులుతోంది. ప్రభుత్వం దృష్టిలో సాహిత్యం అంటే కేవలం అవార్డులా? సంస్కృతి అంటే కేవలం ఉత్సవాలా? అసలు సాంస్కృతిక అభివృద్ధి అంటే ప్రజల భాషకు గౌరవం ఇవ్వడం, విభిన్న స్వరాలకు వేదిక కల్పించడం, విమర్శనాత్మక ఆలోచనను ప్రోత్సహించడం, భావి తరాలకు జ్ఞాపకాలను భద్రపరచడం. అవార్డులు అవసరమే కానీ అవే సాహిత్యాభివృద్ధి కాదు. ఒక సమాజం తన భాషను, తన జానపదాన్ని, తన విభిన్న స్వరాలను ఎంత సజీవంగా ఉంచుకుంటుందో అదే నిజమైన సాంస్కృతిక ప్రగతి. తెలుగు రాష్ట్రాలు ఇప్పుడు అదే కీలక మలుపు వద్ద నిలిచున్నాయి. సాహితీ సాంస్కృతిక దిశలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలూ తక్షణం.

# ఇలియట్ పై రససిద్ధాంత ప్రభావం




టి.ఎస్. ఇలియట్ ఇరవయ్యవ శతాబ్దానికి చెందిన మహత్తర సాహిత్య దిగ్గజం. ఆయన ఆంగ్ల సాహిత్యంలో ప్రఖ్యాత కవే గాక, విమర్శకుడు, నాటకకర్త కూడా. ఒక నాటకకర్తగా ఆయన ఆధునిక సమాజంలో క్షీణించిన విలువలను వ్యక్తపరచడానికి, ప్రసారం చేయడానికి కవిత్వాన్ని ప్రభా వవంతమైన మాధ్యమంగా వినియోగించారు. ఆయన కవితలలోనూ, కవితా నాటకాలలోనూ (గ్రాశీవ్ఱఎ ఐతీఖుమ్ఖం) ఆధ్యాత్మిక తృప్తి కోసం సాగే అన్వేషణ ప్రధానంగా కనిపిస్తుంది. ఆయన రాసిన ఆధునిక మహత్తర దీర్ఘకావ్యం 'ది వేస్ట్‌లాండ్' ప్రపంచవ్యాప్తంగా ఆధునిక కవులు, విమర్శకులపై అపార ప్రభావాన్ని చూపింది. జి.ఎస్. ఫ్రేసర్ అనే ఆంగ్ల విమర్శకుడు 'ది వేస్ట్‌లాండ్' గురించి ఇలా వ్యాఖ్యానించాడు: "ది వేస్ట్‌లాండ్ కన్నా మరే ఇతర ఆధునిక కవిత ఇంత విస్తృతమైన విశ్లేషణకు లోను కాలేదు. అయినప్పటికీ, దీన్ని సంప్రదాయ కవితావర్గాలలో ఏదో ఒకదానికి ధైర్యంగా చేర్చగలిగిన విమర్శకుడూ లేడు; లేదా ఇది పూర్తిగా కొత్త రకమైన కవిత అని భావించినా, ఆ రకానికి కొత్త పేరు పెట్టినవాడూ లేడు." ఒక గొప్ప పండితుడిగా ఇలియట్ భారతీయ తత్త్వశాస్త్రం, ఆలోచనా ధోరణి, కవిత్వం పట్ల అపారమైన గౌరవం ఏర్పర్చుకున్నారు. ఇది ఆయన కవితా రచనలలోనూ, నాటకాలలోనూ స్పష్టంగా కనిపిస్తుంది. భారతీయ సౌందర్యశాస్త్రం పట్ల కూడా ఆయనకు గొప్ప ఆకర్షణ ఉంది. అందుకే 1911లో హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో చార్లెస్ రాక్‌వెల్ లాన్‌మన్ మార్గదర్శకత్వంలో ఇలియట్ సంస్కృతం, పాళీ సాహిత్యాలను విస్తృతంగా అధ్యయనం చేశాడు. ఆయనకు భారతీయ తత్త్వశాస్త్రమంటే ఎంత గాఢమైన ప్రేమో ఈ వాక్యాలు తేటతెల్లం చేస్తాయి: "చాలా కాలం క్రితం నేను ప్రాచీన భారతీయ భాషలను అధ్యయనం చేశాను. ఆ సమయంలో నాకు ముఖ్యంగా తత్త్వశాస్త్రం పైనే ఆసక్తి ఉన్నప్పటికీ, కొద్దిగా కవిత్వాన్నీ కూడా చదివాను. నా కవిత్వంలో భారతీయ ఆలోచనలూ, భావస్పర్శ ప్రభావం చూపాయని నాకు తెలుసు." చార్లెస్ లాన్‌మన్ మార్గదర్శకత్వంలో సంస్కృతం అధ్యయనం చేయడమే కాక జేమ్స్ వుడ్స్ ఆధ్వర్యంలో పతంజలి మెటాఫిజిక్స్‌ను ఒక సంవత్సరం చదువు కోవడం వలన ఇలియట్‌కు భారతీయ తత్త్వశాస్త్రం మీద అమితమైన ఆసక్తి కలిగింది. "భారతీయ తత్వవేత్తలముందు మహత్తర యూరోపియన్ తత్త్వవేత్తలు పాఠశాల విద్యార్థుల్లా కనిపిస్తారు," అని ఇలియట్ అన్నారు. 1911 నుంచి రెండేళ్ళ పాటు ఇలియట్ భారతీయ సౌందర్యశాస్త్రాన్ని కూడా అధ్యయనం చేశాడు. ఆయన కవితా నాటకాలు 1926 నుంచి 1959 మధ్యకాలంలో రచించబడ్డాయి. కాబట్టి ఇలియట్ నాటకాలు రాసే సమయానికే ఆయనకు భారతీయ సౌందర్యశాస్త్రంపైన, దాని సిద్ధాంతాలపైన అవగాహన ఉన్నదని అర్థం చేసుకోవచ్చు. ఇలియట్ భారతీయ ఆలోచనలతోనే కాదు, భారతీయ సాహిత్యంతో కూడా ప్రభావితుడయినందువల్ల భారతీయ సౌందర్యశాస్త్ర సిద్ధాంతాల దృష్టిలో ఇలియట్ రచనలను అధ్యయనం చేయవచ్చు. ముఖ్యంగా ఇలియట్ మానవ స్వభావంలోని సంక్లిష్టతలను అన్వేషించడానికి పద్య నాటకాన్ని శక్తివంతమైన మాధ్యమంగా గుర్తించాడు. పద్యనాటక సంప్రదాయాన్ని పునరుజ్జీవింపజేసి, ఇంగ్లండ్‌లోనే కాక విదేశాల్లోనూ దానికి ప్రాచుర్యం కల్పించేందుకు కృషి చేశాడు. నాటకానికి కవిత్వమే సహజమైన, సంపూర్ణమైన మాధ్యమం అని ఆయన నమ్మాడు. రంగస్థలం అందించగలిగే సంపూర్ణ అనుభూతిలో కొంతే గద్యనాటకం ఇవ్వగలదనీ, పద్యనాటకం అయితే మరింత తీవ్రమైన, ఉత్తేజకరమైన అనుభూతిని అందించగలదనీ ఆయన అంటాడు. ఇలియట్ తన నాటకాలలో మతపరమైన, లౌకికమైన ఇతివృత్తాలను నైపుణ్యంతో వాడుతూ, మానవ అస్తిత్వంలోని వివిధ స్థాయిలను, విభిన్న భావోద్వేగాలను ప్రతిబింబించడానికి పద్య నాటకాన్ని మాధ్యమంగా ఉపయోగించాడు. ఇలియట్ మొత్తం ఐదు ప్రధాన నాటకాలు, రెండు ఉప నాటకాలు రచించాడు. వంటి పద్య నాటకాలలో ఆయన నాటకీయ ప్రతిభ సంపూర్ణంగా వ్యక్తమైంది. భారతదేశంలో కవితాశాస్త్రం నాట్యశాస్త్రం నుంచే వికసించింది. ఇది సాహిత్య విమర్శలో ఒక శాస్త్రీయంగా అభివృద్ధి చెందిన వ్యవస్థ. విస్తృతంగా చెప్పాలంటే ఇది ఎనిమిది సంప్రదాయాలుగా విభజించబడింది. అవి... అలంకార, రీతి, గుణ, వక్రోక్తి, అనుమాన, ఔచిత్య, ధ్వని, రస. భారతీయ కవితాశాస్త్రం విశ్వవ్యాప్తమైనదని అనేకమంది కవులు, సౌందర్యవేత్తలు నిరూపించారు. ఇది భౌగోళిక పరిమితులకు లోబడలేదు, కాబట్టి ఏ కళాఖండాన్నయినా దీని ద్వారా అంచనా వేయవచ్చు. 'రసం' అంటే సారం. ఇది పరమ సౌందర్యానుభూతిని సూచిస్తుంది. అది స్వయంసిద్ధమైన ఆనందాలలో ఒకటి. భారతీయ కవితాశాస్త్రం ప్రాచీనమైనదే కాక అత్యంత అభివృద్ధి చెందిన కళాశాస్త్రం కావడం మూలాన అన్ని కాలాల్లోని, అన్నీ ప్రాంతాల్లోని కళాఖండాల్ని అంచనా వేయడానికి సాధనాలను సమకూరుస్తుంది. ఇప్పటివరకు ఇలియట్ రచనలను పాశ్చాత్య విమర్శాసిద్ధాంతాల దృష్టిలో విశ్లేషించారు కానీ, భారతీయ కవితాశాస్త్రపు దృష్టిలో అధ్యయనం జరగలేదు. ఇలియట్ కవితానాటకాలకు భారతీయ రససిద్ధాంతాన్ని అన్వయించి పరిశీలించి పరిశోధన చేయడానికి సరిగ్గా సరిపోతాయి. రససిద్ధాంతాన్ని క్షుణ్ణంగా అర్థం చేసుకోకుండా ఇలియట్ నాటకాలపై దానిని అన్వయించడం సాధ్యం కాదు. రస సిద్ధాంత మూలాలు వేదకాలంలోనే ఉన్నాయని భావిస్తారు. భరతుడు రససిద్ధాంతాన్ని ప్రతిపాదించినప్పటికీ, ఆనందవర్ధనుడు, అభినవగుప్తుడు వంటి పండితుల చేతుల్లో ఇది మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. సౌందర్యవేత్తల అభిప్రాయం ప్రకారం, మానవ భావోద్వేగాలను పరిశీలించే రసమే ఏ కళాఖండానికైనా ఆత్మలాంటిది. భట్టనాయకుడు రససిద్ధాంతానికి ఒక మెటాఫిజికల్ కోణాన్ని జోడించాడు. ఆయన ప్రకారం, రసం బ్రహ్మానందానికి సమానమైన అనుభూతి, ఇది లోకాసక్తుల నుంచి విముక్తికి మార్గం కూడా. భరతుని నాట్యశాస్త్రం భారతీయ సౌందర్యశాస్త్ర చరిత్రలో గొప్ప మైలురాయి. అందులో భరతుడు ఇలా అంటాడు: "రసం అనే పదం అర్థం చేసుకోవడానికి సులభమైనదే అయినా, నిర్వచించడానికి అత్యంత కఠినమైనది." రసం అనేది ఒక గొప్పనాటకాన్ని చూస్తున్నప్పుడు ప్రేక్షకులు అనుభవించే ఆనందభరితమైన సౌందర్యానుభూతి. ఇది కళాఖండాన్ని సమృద్ధిగా, సార్థకంగా చేస్తుంది. భరతుని ప్రకారం రసం ఇలా ఉత్పన్నమవుతుంది: "విభావానూ వవ్యభిచారి భావసంయోగా ద్రసనిష్పత్తిః" అంటే విభావాలు, అనుభావాలు, వ్యభిచారి భావాలు స్థాయీ భావంతో కలిసినప్పుడు రసం ఉద్భవిస్తుంది. నాట్యశాస్త్రం ఎనిమిది రసాలను విస్తృతంగా చర్చిస్తుంది: శృంగార, హాస్య, కరుణ, రౌద్ర, వీర, భయానక, బీభత్స, అద్భుత రసాలు. శాంత రసాన్ని తొమ్మిదవ రసంగా అభినవగుప్తుడు ప్రతిపాదించాడు. భారతీయ రససిద్ధాంతం విశ్వవ్యాప్తమైనందున, ఏ కళాఖండమైనా నవరసాల దృష్టిలో విశ్లేషించవచ్చు. కాళిదాసు, వాల్మీకి వంటి ప్రాచీనకవుల రచనల్లో రసభావన స్పష్టంగా కనిపిస్తుంది. వాల్మీకి రామాయణం కరుణ రసంతో నిండి ఉంది. వాల్మీకి అనుభవించిన శోకం శ్లోకంగా మారింది. అలాగే ఇలియట్ కూడా తన కవితానాటకాలలో మానవ భావోద్వేగాలను శక్తివంతంగా వ్యక్తీకరించాడు. ప్రాథమికంగా కవియైన ఆయన, ఆ భావాలను సహజంగా చిత్రించడానికి నాటకాన్ని మాధ్యమంగా ఎంచుకున్నాడు. విమర్శకుల అభిప్రాయాలను సమగ్రంగా పరిశీలిస్తే, ఇలియట్ కవితానాటకాన్ని ఆధునిక సమాజానికి ఆధ్యాత్మిక క్రమాన్ని పునఃసృ ష్టించగల శక్తివంతమైన మాధ్యమంగా అభివృద్ధి చేశాడని తెలుస్తుంది. నేటి ఆధునిక సమాజంలోని ఆలోచనలను, భావోద్వేగాలను క్రమబద్ధం చేయడానికి కవిత్వం అత్యవసరం. అటువంటి కవిత్వాన్ని ప్రజలకు చేరువ చేయడానికి కవితానాటకం అత్యుత్తమ మార్గమని తెలుసుకున్న ఇలియట్ ఆ దిశగా అపారమైన నిబద్ధతతో పనిచేశాడు. ఇలియట్ దృష్టిలో, ప్రేక్షకులను ప్రేరేపించగల ఏకైక కళారూపం నాటకమే. ఇలియట్ తన నాటకాలలో వాస్తవం--ఆదర్శాల మధ్య సంఘర్షణను చూపించాడు. మత విశ్వాసం ప్రధాన ఇతివృత్తమైనప్పటికీ, ఆ నాటకాలు సమకాలీన మానవ సమస్యల్ని ప్రతిబింబించాయి. ఆధునిక యాంత్రిక ప్రపంచం సృష్టించిన మానసిక ఆందోళనల నుంచి విముక్తికి ఆధ్యాత్మిక చైతన్యం అవసరమని ఇలియట్ విశ్వసించాడు. మొత్తంగా చెప్పాలంటే, ఇలియట్ కవితానాటకాలు మతపరమైన, ఆధ్యాత్మిక భావనల ప్రభావాన్ని మానవ జీవితాలపై ప్రతిబింబిస్తాయి. ఇలియట్ ఒక్కో కవితానాటకాన్ని ఎవరైనా నిబద్ధులైన పరిశోధకులుంటే భారతీయ సౌందర్యశాస్త్ర రససిద్ధాంతం దృష్టితో అధ్యయనం చేస్తే, వాటి లోతైన భావాత్మక విలువ మరింత స్పష్టంగా అవగతం కావడమే గాక, మన భారతీయ సాహిత్య సాంస్కృతిక ఔన్నత్యాన్ని ప్రపంచానికి ఇంకా విశాలంగా అర్థం చేయవచ్చు.

# ఇల్లు లేని నిరుపేదల కన్నీటి గోడు..వినేదెవరు





-గుడిసెలు కూలాయి..గోడు వినేవారెవరు.?..
-ఇందిరమ్మ ఇళ్లలో దళితులకు అన్యాయమా.?..
-వర్షం దెబ్బకు నిరాశ్రయులైన కుటుంబాలు..
-చిత్తాపూర్ పేదల కన్నీటి పిలుపు.. న్యాయం చేయండి..

హంసకలం వార్త జూన్ 01 మంచిర్యాల జిల్లా ప్రతినిధి

నిరుపేదల సొంతింటి కలను నిజం చేస్తామని ప్రభుత్వం ప్రకటించిన ఇందిరమ్మ ఇళ్ల పథకం చిత్తాపూర్ గ్రామంలోని పేద దళిత కుటుంబాలకు మాత్రం అందని ద్రాక్షగా మారిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నియోజకవర్గం, నెన్నెల మండలం చిత్తాపూర్ గ్రామంలో నివాసముంటున్న పేద కుటుంబాలు ఎన్నో ఏళ్లుగా పక్కా ఇంటి కోసం ఎదురుచూస్తున్నప్పటికీ ఇప్పటివరకు తమకు న్యాయం జరగలేదని వాపోతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలు, ఈదురుగాలుల కారణంగా గ్రామంలోని పలు పేద కుటుంబాల ఇళ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ముఖ్యంగా లింగంపల్లి పోసు (భీమయ్య) కుటుంబానికి చెందిన నివాసం పూర్తిగా కూలిపోగా, లింగంపల్లి పద్మ (పోషం) కుటుంబం నివసిస్తున్న ఇల్లు కూడా తీవ్రంగా దెబ్బతిన్నట్లు గ్రామస్థులు తెలిపారు. ప్రస్తుతం ఈ కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ, ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోననే భయంతో రోజులు గడుపుతున్నాయని చెబుతున్నారు. గ్రామంలోని దళిత కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అన్యాయం జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిజంగా ఇల్లు లేని పేదలను పక్కనబెట్టి, ఇప్పటికే నివాస సౌకర్యాలు కలిగిన వారికి లేదా రాజకీయంగా ప్రభావం కలిగిన వ్యక్తులకు ప్రాధాన్యత ఇచ్చారని విమర్శిస్తున్నారు. అర్హులైన పేదలకు కాకుండా ఇతరులకు ఇళ్ల కేటాయింపులు జరగడం వల్ల అత్యంత వెనుకబడిన కుటుంబాలు ఇప్పటికీ గుడిసెల్లోనే జీవనం సాగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో పెద్ద సంఖ్యలో నివసిస్తున్న మాదిగ కుటుంబాలకు ఒక్క ఇందిరమ్మ ఇల్లు కూడా మంజూరు కాలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇది అధికారుల నిర్లక్ష్యమా, లేక స్థానిక నాయకత్వ వైఫల్యమా అనే ప్రశ్నలు గ్రామంలో చర్చనీయాంశంగా మారాయి. ఎన్నిసార్లు వినతులు అందజేసినా సమస్య పరిష్కారం కాలేదని బాధితులు పేర్కొంటున్నారు. ఇటీవల జరిగిన ప్రకృతి విపత్తుతో ఇళ్లు కోల్పోయిన కుటుంబాలు ఇప్పుడు ప్రభుత్వం, అధికారులు, ప్రజాప్రతినిధుల వైపు ఆశగా చూస్తున్నాయి. తమ పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించి న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో తమ పేర్లను చేర్చి పక్కా ఇళ్లు మంజూరు చేయాలని వేడుకుంటున్నారు. ఈ నేపథ్యంలో బెల్లంపల్లి నియోజకవర్గ ప్రజాప్రతినిధి వినోద్ వెంకటస్వామి స్పందించి చిత్తాపూర్ గ్రామంలోని పేద దళిత కుటుంబాల పరిస్థితిని పరిశీలించాలని, ఇటీవల కూలిపోయిన ఇళ్ల బాధితులకు తక్షణ సహాయం అందించాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇల్లు లేని నిరుపేదలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి అవకాశం కల్పించాలని కోరుతున్నారు. ప్రకృతి వైపరీత్యాలతో ఇళ్లు కోల్పోయిన కుటుంబాలు ఒకవైపు, పథకాల అమలులో అన్యాయం జరిగిందనే ఆరోపణలు మరోవైపు ఉండటంతో చిత్తాపూర్ గ్రామ సమస్య ఇప్పుడు బెల్లంపల్లి నియోజకవర్గంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన లింగంపల్లి పోసు, లింగంపల్లి పద్మ కుటుంబాలకు తక్షణ సహాయం అందించి, గ్రామంలోని ఇల్లు లేని పేద కుటుంబాల సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పుడైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ కుటుంబాల సొంతింటి కలను సాకారం చేస్తారా లేదా అన్నది వేచి చూడాల్సి ఉంది..

# ఆయిల్ పామ్ నర్సరీలో నాణ్యమైన మొక్కలు సిద్ధం చేయాలి

-జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

హంసకలం వార్త జూన్ 01



ఆయిల్ పామ్ సాగు విస్తరణకు అవసరమైన నాణ్యమైన మొక్కలను సిద్ధం చేసి రైతులకు అందుబాటులో ఉంచాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సోమవారం సుల్తానాబాద్ మండలంలోని రెబ్బల్ దేవ్‌పల్లి ఆయిల్ పామ్ ప్రైమరీ, సెకండరీ నర్సరీలను, ఎలిగేడు మండలంలోని ర్యాకల్ దేవ్‌పల్లి ప్రభుత్వ భూములను, నిర్మాణానికి సిద్ధంగా ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా రెబ్బల్ దేవ్‌పల్లి గ్రామంలో 48 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఆయిల్ పామ్ నర్సరీని పరిశీలించిన కలెక్టర్, రాబోయే ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన మేర రైతులకు నాణ్యమైన మొక్కలను సరఫరా చేయాలని సూచించారు. గత సంవత్సరం 40 వేల మొక్కలను ఇతర జిల్లాలకు సరఫరా చేసినట్లు, వాటిని తిరిగి తీసుకువస్తున్నట్లు అధికారులు వివరించారు. ప్రస్తుతం 20 వేల మొక్కలు అందుబాటులో ఉన్నాయని తెలపగా, 1,000 ఎకరాలకు అవసరమైన మొక్కలను సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం ర్యాకల్ దేవ్‌పల్లి పరిధిలోని ప్రభుత్వ భూములను పరిశీలించిన కలెక్టర్, మండలంలోని ప్రభుత్వ భూములకు సంబంధించిన సంపూర్ణ వివరాలను సిద్ధం చేసి సమర్పించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్, ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా నాణ్యతతో పనులు చేపట్టాలని, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో హార్టికల్చర్ అధికారులు ఎస్. మహేష్, జ్యోతి, తిరుమల ఆయిల్ పామ్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ కేశ్ కళ్యాణ్‌కర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

-పలు సమస్యలపై వినతులు స్వీకరించిన జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్

హంసకలం వార్త జూన్ 01



ప్రజావాణి అర్జీల పై సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్ ఆదేశించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. పలు సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు మండలాల నుండి ప్రజలు సమస్యలు విన్న వించుకోడానికి ప్రజావాణికి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా ఈరోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 67 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పొగాకు నిషేధ దినోత్సవం - 2026 సందర్భంగా జిల్లా వైద్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా అధికారులు, అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్ లు మరియు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఏ12...కలలు నెరవేరాయా

హంసకలం వార్త జూన్ 01



దాదాపు ఆరు దశాబ్దాల పోరాటం,వేలాది మంది ఉద్యమకారుల త్యాగాలు,విద్యార్థుల ఆత్మాహుతులు,ప్రజా సంఘాల నిరంతర కృషి,రాజకీయ ఒత్తిళ్ల ఫలితంగా 2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించింది.ఇది కేవలం పరిపాలనా విభజన మాత్రమే కాదు.స్వయం పాలన, స్వాభిమానం, సామాజిక న్యాయం,ప్రాంతీయ అసమానతల నిర్మూలన కోసం సాగిన ప్రజా ఉద్యమానికి లభించిన విజయంగా చరిత్రలో నిలిచిపోయింది .తెలంగాణ ఉద్యమం ఒక్కరోజులో పుట్టినది కాదు.1969 ఉద్యమం నుంచి ప్రారంభమైన అసంతృప్తి కాలక్రమేణా బలపడింది.నీళ్లు,నిధులు, నియామకాలలో తెలంగాణకు అన్యాయం జరుగుతోందనే భావన ప్రజల్లో బలంగా నాటుకుంది. ఉద్యోగులు, రైతులు, మేధావులు, కళాకారులు, రచయితలు, ప్రజా సంఘాలు ఉద్యమానికి అండగా నిలిచాయి. ముఖ్యంగా ఉస్మానియా విశ్వవిద్యాలయం కేంద్రంగా విద్యార్థి ఉద్యమం తెలంగాణ ఆకాంక్షను జాతీయ స్థాయికి తీసుకెళ్లింది.రాజకీయంగా చూస్తే వివిధ దశల్లో అనేక పార్టీలు తెలంగాణకు మద్దతు ప్రకటించాయి.తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) ఉద్యమాన్ని రాజకీయ అజెండాగా ముందుకు తీసుకెళ్లగా,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర విభజనకు ఆమోదం తెలిపింది.చివరికి బీజేపీ కూడా మద్దతు తెలిపింది.వామపక్షాలు,ప్రజా సంఘాలు,ఉద్యోగ సంఘాలు, జేఏసీలు ఉద్యమానికి సామాజిక బలాన్ని అందించాయి.ఈ సమష్టి కృషి ఫలితంగానే తెలంగాణ కల సాకారమైంది.రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ అనేక రంగాల్లో పురోగతి సాధించింది.సాగునీటి ప్రాజెక్టులు,మిషన్ భగీరథ,మిషన్ కాకతీయ,రైతు బంధు,రైతు బీమా,గ్రామీణ అభివృద్ధి,మౌలిక సదుపాయాల విస్తరణ వంటి కార్యక్రమాలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. హైదరాబాద్ ప్రపంచ పెట్టుబడులకు ఆకర్షణీయ కేంద్రంగా మరింత ఎదిగింది. ఐటీ,ఫార్మా,పారిశ్రామిక రంగాల్లో తెలంగాణ తనదైన ముద్ర వేసుకుంది. అదే సమయంలో 2023 లో ప్రభుత్వ మార్పు అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తోంది.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించే మహాలక్ష్మి పథకం,రూ.500కే గ్యాస్ సిలిండర్,గృహ వినియోగదారులకు ఉచిత విద్యుత్ అందించే గృహ జ్యోతి,రైతులకు రైతు భరోసా,నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు,మహిళా సంఘాల సాధికారత,యువతకు ఉద్యోగావకాశాల కల్పన,ప్రభుత్వ ఉద్యోగ నియామకాల వేగవంతం, మూసీ పునరుజ్జీవనం,మౌలిక సదుపాయాల విస్తరణ వంటి కార్యక్రమాలను అమలు చేస్తోంది.ఈ చర్యలు తెలంగాణ అభివృద్ధి ప్రయాణంలో మరో దశగా నిలుస్తాయా లేదా అన్నది రానున్న కాలంలో స్పష్టమవుతుంది.అయితే, తెలంగాణ ఉద్యమం కేవలం భౌగోళిక రాష్ట్రం కోసం మాత్రమే జరగలేదు.”సామాజిక తెలంగాణ” అనే నినాదం కూడా ఉద్యమానికి ప్రధాన బలం.అణగారిన వర్గాలు, దళితులు,బీ సీలు,గిరిజనులు, మైనార్టీలు పాలనలో సముచిత భాగస్వామ్యం పొందాలని ఉద్యమకారులు ఆశించారు.స్వరాష్ట్రం ఏర్పడి దశాబ్దానికి పైగా గడిచినా సామాజిక తెలంగాణ లక్ష్యం పూర్తిగా నెరవేరిందా అనే ప్రశ్న ఇప్పటికీ చర్చనీయాంశంగానే ఉంది.అధికార మార్పులు జరిగినా,పాలక వర్గాల ఆధిపత్యం,నిరుద్యోగ సమస్య, వ్యవసాయ సంక్షోభం,ప్రాంతీయ అసమానతలు, సామాజిక న్యాయం వంటి అంశాలు ఇంకా పూర్తిస్థాయిలో పరిష్కారం కాలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన అనేక మంది కార్యకర్తలు గుర్తింపు,సంక్షేమం కోసం ఇంకా ఎదురుచూస్తున్నారు. అందుకే ప్రస్తుతం కేకే కమిటీ వంటి ప్రయత్నాలు ఉద్యమకారుల ఆశలను మళ్లీ రేకెత్తిస్తున్నాయి. తెలంగాణ అభివృద్ధి ప్రయాణం ఏ ఒక్క పార్టీ లేదా ప్రభుత్వం కృషి ఫలితం మాత్రమే కాదు.ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తూ వివిధ ప్రభుత్వాలు తమదైన విధానాలతో రాష్ట్ర నిర్మాణంలో పాత్ర పోషిస్తున్నాయి.గత ప్రభుత్వాల అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కూడా ప్రజల జీవితాలపై ఎలాంటి ప్రభావం చూపుతున్నాయో రానున్న సంవత్సరాల్లో స్పష్టమవుతుంది. తెలంగాణ సాధన ఒక చారిత్రక విజయం.కానీ,సామాజిక తెలంగాణ నిర్మాణం నిరంతర ప్రక్రియ.అభివృద్ధి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు సమానంగా అందినప్పుడే, ఉద్యమంలో వ్యక్తమైన ఆకాంక్షలు పూర్తిగా నెరవేరినట్లవుతుంది. స్వరాష్ట్రం సాధించిన గర్వంతో పాటు,సామాజిక న్యాయం,సమాన అవకాశాలు, ప్రజా భాగస్వామ్య పాలన వైపు అడుగులు వేయడం తెలంగాణ ముందు ఉన్న అసలు సవాలు.తెలంగాణ కథ ఇంకా ముగియలేదు.రాష్ట్ర సాధన మొదటి అధ్యాయం అయితే,సామాజిక తెలంగాణ నిర్మాణమే తదుపరి అధ్యాయం.ఆ లక్ష్యం నెరవేరినప్పుడే ఉద్యమం సంపూర్ణ విజయాన్ని అందుకున్నట్లు చరిత్ర నమోదు చేస్తుంది.

# ఏఎస్సై ఉద్యోగన్నతి పొందిన పోలీస్ అధికారులను అభినందించిన సీపీ



హంసకలం వార్త జూన్ 01

వివిధ పోలీస్ స్టేషన్ లలో హెడ్ కానిస్టేబుల్ గా నిరంతరంగా సేవలందించి ఏఎస్సై (అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్) గా ఉద్యోగన్నతి పొందిన నలుగురు పోలీస్ అధికారులు ఎస్ కె .దొరసాని, ఎన్.శ్రీనివాసరాజు, జెడ్ .ఆదినారాయణ, జి.నాగేశ్వరరావు లను పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పదోన్నతి చిహ్నాన్ని అలంకరించి, అభినందనలు తెలియజేశారు. పదోన్నతి పొందిన వారు మహబూబాబాద్ జిల్లా కు బదిలీపై వెళ్ళనున్నారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా లో పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు

-సోమశిల, నార్లాపూర్, ఉయలవాడ ప్రాంతాల్లో ఏర్పాట్లను పరిశీలన
-భద్రత, బస, హెలిప్యాడ్, సమీక్షా సమావేశ ఏర్పాట్లపై కలెక్టర్ ఆదేశాలు
-కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్



హంసకలం వార్త జూన్ 01

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల సందర్శన నిమిత్తం ఈ నెల 4, 5 తేదీల్లో రెండు రోజుల పాటు పర్యటించనున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేపడుతోంది. ఈ సందర్భంగా సోమవారం జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్‌తో కలిసి కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని సోమశిల, నార్లాపూర్ ప్రాంతాలతో పాటు నాగర్‌కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని ఉయాలవాడ ప్రాంతాలను సందర్శించి ముందస్తు ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. మొదట సోమశిలలోని హరిత గెస్ట్ హౌస్‌ను సందర్శించిన అధికారులు, ముఖ్యమంత్రి బస చేయనున్న గదులు, సమావేశ మందిరాలు, విశ్రాంతి సదుపాయాలు, తాగునీరు, విద్యుత్, పారిశుధ్య ఏర్పాట్లను సమీక్షించారు. ముఖ్యమంత్రి పాల్గొనే ఉమ్మడి పాలమూరు జిల్లా సాగునీటి ప్రాజెక్టుల సమీక్షా సమావేశం విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటనకు అత్యంత ప్రాధాన్యత ఉన్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా పరిశీలించారు. హరిత గెస్ట్ హౌస్ పరిసర ప్రాంతాలు, ప్రవేశ మార్గాలు, పార్కింగ్ ప్రాంతాలు, సమావేశ ప్రాంగణంలో చేపట్టాల్సిన భద్రతా చర్యలపై పోలీసు అధికారులతో చర్చించారు. పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి హెలికాప్టర్ రాకపోకల దృష్ట్యా ఏర్పాటు చేయనున్న హెలిప్యాడ్ స్థలాన్ని కూడా పరిశీలించిన అధికారులు, అక్కడ భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, ప్రజల రాకపోకల నిర్వహణకు సంబంధించిన చర్యలపై సూచనలు చేశారు. హెలిప్యాడ్ నుంచి పర్యటన ప్రాంతాలకు వెళ్లే రహదారుల మరమ్మతులు, శుభ్రత పనులను వెంటనే పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ శాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం నార్లాపూర్‌లోని పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్యాకేజీ--3 పనులను పరిశీలించారు. ముఖ్యమంత్రి ఈ పర్యటనలో భాగంగా నార్లాపూర్ రిజర్వాయర్ స్టేజ్--3 పనులను ప్రత్యక్షంగా పరిశీలించనున్న నేపథ్యంలో అక్కడి పనుల పురోగతి, సందర్శన ఏర్పాట్లు, భద్రతా చర్యలపై సమీక్ష నిర్వహించారు. పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం తెలంగాణ రాష్ట్రంలోని అత్యంత ప్రతిష్ఠాత్మక సాగునీటి ప్రాజెక్టులలో ఒకటిగా ఉన్నందున, ప్రాజెక్టు పనుల పురోగతికి సంబంధించిన పూర్తి వివరాలను సిద్ధం చేయాలని కలెక్టర్ ఇరిగేషన్ శాఖ అధికారులను ఆదేశించారు. ఉయాలవాడలో నూతనంగా నిర్మించిన నీటిపారుదల శాఖ కార్యాలయ సముదాయాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించనున్న నేపథ్యంలో అక్కడి హెలికాప్టర్ ఏర్పాట్లను కూడా పరిశీలించారు. అనంతరం కుమ్మెర ప్రాంతంలోని పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను సందర్శించి సంబంధిత అధికారులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్‌సీ పార్థసారథి, ఆర్డీఓ బన్సీలాల్, నాగర్‌కర్నూల్ ఆర్డీఓ సురేష్‌బాబు, డీఎస్పీ శ్రీనివాస్, తహసీల్దార్ మాధవి, నాగర్‌కర్నూల్ తహసీల్దార్ తబితా రాణి, ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస్ రెడ్డి, ఆర్ అండ్ బీ ఈఈ శ్రీధర్‌తో పాటు పోలీసు, రెవెన్యూ, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి 148 ఫిర్యాదులు

హంసకలం వార్త జూన్ 01

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 148 ఫిర్యాదులు అందాయి. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు, అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, భుజంగరావు, డీఆర్ఓ గీత, జిల్లా పరిషత్ సీఈఓ సాయాగౌడ్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, డీపీఓ శ్రీనివాస్, డీఆర్డీఓ సాయన్న, బోధన్ ఏసీపీ శ్రీనివాస్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, ఫిర్యాదులను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ మనందరి సామాజిక బాధ్యత

-జిల్లా కలెక్టర్ రాజర్షి షా

హంసకలం వార్త జూన్ 01



పర్యావరణ పరిరక్షణ అనేది మనందరి సామాజిక బాధ్యత అని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు.'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక' పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,రాబోయే 99 రోజుల్లో జిల్లా వ్యాప్తంగా అడవులను రక్షించడం, ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్క నాటి దానిని బాధ్యతగా కాపాడటం వంటి పనులను ఉద్యమంలా చేపట్టాలని పిలుపునిచ్చారు.తద్వారా జిల్లాలో పచ్చదనాన్ని పెంపొందించి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని సృష్టించవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ ప్రత్యేక ప్రణాళికలో ముఖ్యంగా జల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడం జరుగుతుందని,నీటి వృథాను అరికట్టి, ప్రతి నీటి బొట్టును అత్యంత విలువైనదిగా భావించి పొదుపు చేయాలని కోరారు.అలాగే ప్లాస్టిక్ రహిత జీవితాన్ని అలవర్చుకోవడంలో భాగంగా ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించి,రీసైక్లింగ్ పద్ధతులను పాటించాలని సూచించారు.భూమిపై ఉన్న ప్రతి జీవిని రక్షిస్తూ జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవడం మనందరి ప్రాథమిక కర్తవ్యమని గుర్తుచేశారు. గ్లోబల్ వార్మింగ్,వాతావరణ మార్పులను అదుపు చేయడానికి కార్బన్ ఉద్గారాలను తగ్గించి మన భవిష్యత్తును కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. “పచ్చదనం పెంచుదాం- పర్యావరణాన్ని కాపాడుదాం” అనే నినాదంతో సాగుతున్న ఈ 99 రోజుల సుదీర్ఘ కార్యాచరణలో జిల్లా ప్రజలు, యువత, స్వచ్ఛంద సంస్థలు పెద్ద ఎత్తున భాగస్వాములు అయి,ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.అనంతరం పర్యావరణ పరిరక్షణపై అధికారులతో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించి, కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రు,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, జిల్లా అటవీ అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్,జడ్పీ సీఈఓ రవి, అటవీ,వివిధ శాఖల అధికారులు, పాల్గొన్నారు.

# తక్కెళ్ళపాడు గ్రామ సర్పంచ్ ముక్కల రామకృష్ణారెడ్డి పై చర్యలు తీసుకోవాలి





కూరపాటి సురేష్ ఎమ్మార్వో కి వినతి పత్రం అందజేశారు


హంసకలం వార్త జూన్ 01

ఎర్రుపాలెం మండలం తక్కెళ్ళపాడు గ్రామంలో ఇసుక చెరువు మట్టిని డ్యూటీ చేస్తున్న సర్పంచ్ పై చర్యలు తీసుకోవాలని గ్రీటింగ్స్ లో అధికారులకు వినతి పత్రం ఇచ్చిన కూరపాటి సురేష్ ప్రజా నాయకుడు ఇవ్వడం జరిగినది. తక్కెళ్ళపాడు గ్రామంలోని సర్పంచి ముక్కల రామకృష్ణారెడ్డి చెరువు మట్టిని మరియు ఇసుకను అధికారులు పర్మిషన్ లేకుండా తన రాజకీయ అండదండలతో అక్రమాలకు పాల్పడుతున్న తక్కెళ్ళపాడు సర్పంచ్ పై చట్టరిదమైన చర్యలు చేపట్టాలని ఎర్రుపాలెం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ లో కూరపాటి సురేష్ ప్రజా నాయకుడు అధికారులకు ఫిర్యాదు చేయడం జరిగినది చెరువులో మట్టిని ఏమిరెడ్డి భార్గవ రెడ్డి పొలానికి 500 ట్రాక్టర్ టిప్పులు తోలటంపై విచారణ చేపట్టాలని పేదలను పట్టించుకోకుండా తన వ్యక్తిగత స్వార్థాల కోసం ప్రయోజనాల కోసం భూస్వాములకే పట్టం కట్టడం అనేది ఆయన యొక్క అహంకారానికి నిదర్శమని ఈ ప్రకటనలో తెలిపారు

# 6500 మంది పోలీస్ అధికారులతో డీజీపీ మెగా వీడియో కాన్ఫరెన్స్

-6500 మంది పోలీస్ అధికారులతో డీజీపీ మెగా వీడియో కాన్ఫరెన్స్
-సైబర్ నేరాలు,డ్రగ్స్, ట్రాఫిక్ సవాళ్లను ఎదుర్కొనేందుకు పోలీసింగ్‌లో మార్పులు అవసరం
-తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్

హంసకలం వార్త జూన్ 01



రాష్ట్రంలో పెరుగుతున్న సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా,ట్రాఫిక్ సమస్యలను సమర్థంగా ఎదుర్కొనేందుకు పోలీస్ శాఖ ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా మారాల్సిన అవసరం ఉందని తెలంగాణ డీజీపీ సి.వి.ఆనంద్ పేర్కొన్నారు. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 6,500 మంది పోలీస్ అధికారులతో నిర్వహించిన మెగా వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు .ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరాల నియంత్రణలో మరింత సమర్థవంతంగా పనిచేయాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో ఆహార పదార్థాల కల్తీ నివారణపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ఫుడ్ అడల్టరేషన్ ప్రివెన్షన్ విభాగం ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా రహదారి భద్రతను మెరుగు పరచేందుకు రోడ్ సేఫ్టీ విభాగం,ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగాన్ని పెంచేందుకు టెక్నాలజీ విభాగం,అంతర్గత పర్యవేక్షణ కోసం విజిలెన్స్ విభాగం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రజలకు మరింత చేరువయ్యేలా ప్రతి పోలీస్ స్టేషన్‌లో ప్రతిరోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు సందర్శన వేళలు (విజిటింగ్ అవర్స్) కేటాయించాలని డీజీపీ ఆదేశించారు. ఈసమయంలో ప్రజల ఫిర్యాదులు,సమస్యలను స్వీకరించి వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. సైబర్ నేరాల నియంత్రణ,డ్రగ్స్ నిర్మూలన,ట్రాఫిక్ నిర్వహణలో సమన్వయంతో పనిచేస్తూ ప్రజల్లో పోలీస్ శాఖపై మరింత విశ్వాసం పెంపొందించేలా అధికారులు కృషి చేయాలని డీజీపీ సీవీ ఆనంద్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ప్రజా భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ ఆధునిక పోలీసింగ్‌కు శ్రీకారం చుడుతున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

# ప్రజా వినతులను సత్వరమే పరిష్కరించాలి

-జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
-ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్

హంసకలం వార్త జూన్ 01



ప్రజా వినతులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు. కామేపల్లి మండలం సాతాని గూడెం గ్రామానికి చెందిన కన్నేటీ రంగయ్య ముచ్చర్ల రెవెన్యూ గ్రామ పరిధిలో సర్వే నెంబర్ 255, 262లో ఆరు ఎకరాల 20 గుంటలు వ్యవసాయ సాగు భూమి ఉందని, ఈ పొలంలోకి వెళ్ళుటకు దారి చూపించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం రూరల్ మండలం గోళ్ళపాడు గ్రామానికి చెందిన ఎం.వెన్నెల తనకు తల్లి తండ్రులు లేరని, 10వ తరగతి ఉత్తీర్ణత 493 మార్కులతో సాధించడం జరిగిందని, తనకు ఎం.పి.హెచ్.డబ్ల్యూ లో సీట్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా ఆర్.సి.ఓ బీసీ సంక్షేమ శాఖకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. చింతకాని మండలం పాతర్లపాడు గ్రామానికి చెందిన కె.వెంకటేశ్వర్లు భవన నిర్మాణ కార్మికులకు అందించే ప్రసూతి ఆర్థిక సహాయం తనకు అందించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, లేబర్ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ మొరం తవ్వకాలపై చీతా ఫోర్స్ మెరుపు దాడి

హంసకలం వార్త జూన్ 01

నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, ఆదేశాల మేరకు, అక్రమ మైనింగ్ మరియు సహజ వనరుల అక్రమ రవాణాను అరికట్టేందుకు సీసీఎస్ ఏసీపీ ఇన్‌చార్జ్ మస్తాన్ అలీ పర్యవేక్షణలో చీతా ఫోర్స్ బృందం ప్రత్యేక నిఘా మరియు తనిఖీలు నిర్వహిస్తోంది. కమ్మర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని బషీరాబాద్ గ్రామ శివారులో గల కాడి చెరువు వద్ద అక్రమంగా మొరం తవ్వకాలు జరుగుతున్నాయనే విశ్వసనీయ సమాచారం మేరకు చీతా ఫోర్స్ సిబ్బంది ఆకస్మికంగా మెరుపు దాడి నిర్వహించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసు బృందం అక్కడ అక్రమంగా మొరం తవ్వి తరలిస్తున్న కార్యకలాపాలను గుర్తించింది. తనిఖీల సందర్భంగా మొరం తవ్వకాల కోసం వినియోగిస్తున్న ఒక జేసీబీ యంత్రం మరియు మొరాన్ని రవాణా చేస్తున్న ఐదు ట్రాక్టర్లను అధికారులు పట్టుకొని స్వాధీనం చేసుకున్నారు. అక్రమ తవ్వకాల ద్వారా ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగించడమే కాకుండా పర్యావరణ సమతుల్యతకు భంగం కలిగించే చర్యలకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునే దిశగా అధికారులు ముందుకు సాగుతున్నారు. చీతా ఫోర్స్ చేపట్టిన ఈ దాడి ద్వారా అక్రమ మైనింగ్ కార్యకలాపాలకు అడ్డుకట్ట పడటంతో పాటు, ఇలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారికి గట్టి హెచ్చరికగా నిలిచింది. స్వాధీనం చేసుకున్న జేసీబీ మరియు ఐదు ట్రాక్టర్లను తదుపరి విచారణ మరియు చట్టపరమైన చర్యల నిమిత్తం కమ్మర్‌పల్లి పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓ కు అప్పగించారు.ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ, నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అక్రమ మొరం, ఇసుక, మట్టి తవ్వకాలు



మరియు రవాణాపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, ప్రభుత్వ సహజ వనరులను అక్రమంగా దోచుకునే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో ఇలాంటి అక్రమ కార్యకలాపాలు గమనించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని కోరారు.

# భారీ చోరీ కేసు ఛేదన

-ముగ్గురు నిధితులు అరెస్ట్..ఒకరు పరారు

హంసకలం వార్త జూన్ 01

ఆర్మూర్ లో జరిగిన భారీ చోరీ కేసు ఛేధించారు పోలీసులు.?ముగ్గురు నిందితుల అరెస్ట్ చేసి వారి వద్ద నుండి రూ.31.48 లక్షల విలువైన సొత్తు స్వాధీనం స్వాధీనం చేసుకున్నారు. ఆర్మూర్ పట్టణంలో జరిగిన భారీ చోరీ కేసును పోలీసులు చాకచక్యంగా ఛేదించారు. తన బాబాయ్ ఇంట్లోనే చోరీకి పథకం పన్నిన ప్రధాన నిందితుడితో పాటు మరో ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.31.48 లక్షల విలువైన బంగారం, వెండి వస్తువులు మరియు నగదును స్వాధీనం చేసుకున్నారు. సోమవారం జిల్లాలోని కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోలీస్ కమిషనర్ సాయి చైతన్య వివరాలు వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ.. గత నెల 24న ఆర్మూర్ పట్టణంలో 41.31 లక్షల విలువైన బంగారం, వెండి, నగదు చోరీకి గురైనట్లు బాధితులు ఆర్మూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు తీవ్రతను గుర్తించిన అధికారులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం ఆర్మూర్ బ్రాహ్మణపల్లి ఎక్స్ రోడ్డు వద్ద కొందరు వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తున్నారన్న నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని తనిఖీలు నిర్వహించారు. నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా, అసలు విషయం బయటపడింది. నిందితుడు విజయ్ అగర్వాల్ ఆర్మూర్ మహాలక్ష్మి కాలనీలో ఉన్న తన బాబాయ్ కుటుంబ సభ్యులు వేములవాడకు వెళ్లిన సమయాన్ని ఆసరాగా చేసుకున్నాడు. ఆ సమయంలో ఇంట్లో చోరీ చేయాలని పథకం పన్ని సల్మాన్ ఖాన్, మంజల్ సాయి కుమార్, పరారీలో ఉన్న శ్రీహరిలను డబ్బులకు ఒప్పందం చేసుకున్నాడు. వీరి ద్వారా ఇంట్లో ఉన్న విలువైన వస్తువులు, నగదును దొంగిలించాడు. నిందితులు చోరీ చేసిన సొమ్ములో కొంత మొత్తాన్ని ఇప్పటికే ఖర్చు చేయగా, మిగిలిన సొత్తును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల నుంచి 580 గ్రాముల బంగారం ముద్దలు, 10 గ్రాముల బంగారు చైన్, 300 గ్రాముల వెండి లక్ష్మి బిళ్లలు, 50 గ్రాముల వెండి ప్లేటు, . 19.33 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 31.48 లక్షల విలువైన సొత్తును పోలీసులు రికవరీ




చేశారు. చోరీ చేసిన సొమ్ములో కొంత మొత్తాన్ని నిందితులు ఖర్చు చేయగా, మిగిలిన సొత్తు పరారీలో ఉన్న నిందితుడి వద్ద ఉన్నట్లు గుర్తించారు. ప్రధాన నిందితుడు విజయ్ అగర్వాల్‌పై ఇప్పటికే ఆర్మూర్ పోలీస్ స్టేషన్‌లో ఏడు క్రిమినల్ కేసులు నమోదై ఉన్నాయని, అతని నేర ప్రవృత్తిని దృష్టిలో ఉంచుకుని గతంలోనే రౌడీ షీట్ తెరిచినట్లు పోలీసులు తెలిపారు. కేసును వేగంగా ఛేదించిన ఆర్మూర్ డీసీపీ వెంకటేశ్వర్ రెడ్డి, టౌన్ ఏసీపీ సత్యనారాయణ, సీఐఎస్ ఇన్‌స్పెక్టర్ సాయినాథ్, సిబ్బంది అమరేందర్, కిరణ్ కుమార్, సతీష్, అశోక్, అన్వేష్‌లను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ప్రత్యేకంగా అభినందించారు.

# అమరుల త్యాగ ఫలితమే తెలంగాణ రాష్ట్రం

-తెలంగాణ అమరవీరులకు స్మృతి దీపం

-తెలంగాణ అస్తిత్వంపై కుట్రలు చేస్తే సహించం

-ఉద్యమ నాయకులు పందుల సైదులు

హంసకలం వార్త జూన్ 01

నల్లగొండ: అమరుల త్యాగాల ఫలితమే ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అని వారి త్యాగాలను నిరంతరం కొనియాడాల్సిన బాధ్యత తెలంగాణ సమాజం పై ఉందని వారు కలలుగన్న తెలంగాణ కోసం ముందుకు సాగాలిసిన అవసరం ఉందని తెలంగాణ ఉద్యమ నాయకులు,తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు పందుల సైదులు అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం జరిగి పుష్కరకాలం పూర్తవుతున్న సందర్భంగా సోమవారం నల్గొండ జిల్లా కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారులు, తెలంగాణ పౌర సమాజ సంస్థలు, ప్రజాసంఘాలు, మేధావులు, విద్యార్థి నాయకుల ఆధ్వర్యంలో అమర వీరుల స్తూపం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన చేసి అమరుల స్మృతి దీపం పేరిట అమరులను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం వివిధ దశల్లో పనిచేసిన ఉద్యమ శక్తులు సంయుక్తంగా అమరుల స్మృతి దీపం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించుకోవడం జరిగిందన్నారు.తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన వేలాది మంది అమరవీరుల త్యాగాలను కొనియాడుతూ, త్యాగస్ఫూర్తిని గుర్తు తీసుకున్నామన్నారు.తెలంగాణ రాష్ట్రం అనేది ఎవరి దయాదాక్షిణ్యాల వల్ల వచ్చినది కాదని, విద్యార్థులు, యువత, ఉద్యోగులు,రైతులు,మహిళలు,వివిధ వర్గాల ప్రజల దశాబ్దాల పోరాటాలు,వేలాది మంది అమరుల ఆత్మబలిదానాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం సాకారమైందని అన్నారు. తెలంగాణ చరిత్రలో అమరవీరుల త్యాగాలు శాశ్వతంగా నిలిచిపోతాయని, వారి స్ఫూర్తిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ఉద్యమకారులుగా మాపై ఉందన్నారు.అమరులు కలలుగన్న తెలంగాణ అంటే కేవలం ప్రత్యేక రాష్ట్రం మాత్రమే కాదని, దోపిడీ, పీడన, సామాజిక అసమానతలు, ప్రాంతీయ వివక్ష,నిరుద్యోగం,అన్యాయాలు లేని ప్రజాస్వామిక, సమానత్వ తెలంగాణ అన్నారు. తెలంగాణ ఏర్పడి పన్నెండు సంవత్సరాలు పూర్తవుతున్నప్పటికీ అమరవీరుల ఆశయాలకు అనుగుణమైన పాలన ఇంకా పూర్తిస్థాయిలో అమలుకావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర అప్పులు ప్రస్తుతం ఎనిమిదిన్నర లక్షల కోట్ల రూపాయలను దాటినప్పటికీ అభివృద్ధి ఫలాలు సాధారణ ప్రజలకు సమానంగా అందడం లేదన్నారు.అభివృద్ధి పేరుతో హైదరాబాద్ నగరానికే ప్రాధా న్యత ఇస్తూ,మిగతా జిల్లాలు,మండలాలు, గ్రామీణ ప్రాంతాలను నిర్లక్ష్యం చేస్తున్న ధోరణి ఆందోళన కలిగిస్తోందన్నారు. తెలంగాణ ఉద్యమం లక్ష్యం కేవలం ఒక నగర అభివృద్ధి కాదని, రాష్ట్రంలోని ప్రతి గ్రామం,ప్రతి మండలం,ప్రతి జిల్లా సమానంగా అభివృద్ధి చెందడమేనని స్పష్టం చేశారు. వ్యవసాయం, విద్య, వైద్యం,ఉపాధి,పరిశ్రమలు మరియు సామాజిక సంక్షేమ రంగాలలో సమగ్ర అభివృద్ధి జరగాల్సిన అవసరం ఉందన్నారు.నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం,ప్రభుత్వ ఖాళీలను భర్తీ చేయడం,ప్రభుత్వ విద్యా మరియు వైద్య వ్యవస్థలను బలోపేతం చేయడం,గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించడం వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరిగిన నాటి నుండి నేటి వరకు సమైక్యవాద భావజాలంతో పనిచేసే శక్తులు, తెలంగాణ వ్యతిరేక రాజకీయ శక్తులు, తెలంగాణ అస్తిత్వాన్ని అంగీకరించలేని వర్గాలు రాష్ట్ర స్వాభి మానాన్ని దెబ్బతీయడానికి వివిధ రూపాల్లో కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు .తెలంగాణ భాష,సంస్కృతి,చరిత్ర, రాజకీయ అస్తిత్వం, స్వయంపాలన భావనలను బలహీనపరిచే ప్రయత్నాల పట్ల తెలంగాణ సమాజం అప్రమత్తంగా గమనించాల్సిన అవసరం ఉందన్నారు.తెలంగాణ అస్తిత్వం అనేది కేవలం భౌగోళిక సరిహద్దుల ప్రశ్న కాదని,అది స్వాభిమానం,స్వయంపాలన,సామాజిక న్యాయం,ప్రజల ఆత్మగౌరవానికి సంబంధించిన అంశమని పేర్కొన్నారు. తెలంగాణపై విషపూరిత సమైక్య శక్తులు అనవ సరమైన ప్రేలాపనలు చేస్తే చూస్తూ ఊరు కోవడానికి సిద్ధంగా లేమన్నారు.తెలంగాణ అస్తిత్వంపై కుట్రలు చేస్తే తెలంగాణ సమాజం మరో ఉద్యమానికి శ్రీకారం



చుడుతుందని హెచ్చరించారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం అంటే,వారు కలలుగన్న తెలంగాణ నిర్మాణం కోసం నిరంతరం కృషి చేయడమే వారికి నిజమైన నివాళి అని అన్నారు. అమరుల స్మృతి దీపం కార్యక్రమం తెలంగాణ ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని సజీవంగా ఉంచడంతో పాటు భావితరాలకు తెలంగాణ చరిత్రను పరిచయం చేసే ప్రజా చైతన్య కార్యక్రమంగా కొనసాగాలని వారు ఆకాంక్షించారు.తెలంగాణ అమరవీరుల ఆశయాల సాధన వరకు ప్రజాస్వామ్య పంథాలో పోరాటాలు కొనసాగుతాయని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. అమరుల త్యాగం తెలంగాణకు పునాది అని వారి ఆశయాల సాధనే వ నిజమైన నివాళి అన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు బోనగిరి దేవేందర్,చీర పంకజ్ యాదవ్,దూసరి కిరణ్ కుమార్, చింతమల్ల గురువయ్య, కె.పర్వతాలు, ఇందూరి సాగర్, ఆర్.విజయ్ కుమార్, పి.ఏడుకొండలు, మల్లేశం ఆర్ లక్ష్మయ్య,పెండెం ధనుంజయ నేత, వెంకటేశ్వర్లు,బీవీ చారి, గద్దపాటి సురేందర్, కె.రత్నయ్య, సునీత, గూడూరి జానకిరామ్ రెడ్డి, అయితగోని జనార్దన్ గౌడ్, మాతంగి అమర్,బట్టు నవీన్, కొండేటి మురళి తదితరులు పాల్గొన్నారు.

# సీఎంమాటలతో జ్ఞానోదయం కలిగేనా?స్వీట్ వార్నింగ్! కాంగ్రెస్‌లో హాట్ టాపిక్

-ఆయన సూచనలను మంత్రులూ, ఎమ్మెల్యేలూ, కార్పొరేషన్ చైర్మన్ లూ ఆచరణలో పెడుతారా

-పార్టీకీ,ఎమ్మెల్యేలకు మధ్య కోఆర్డినేషన్ నిల్ మూడేండ్ల కే పార్టీ కేడర్‌కు దూరమైన ఎమ్మెల్యేలు

-పార్టీకంటే, పర్సనల్ ఇమేజ్ కే తొలి ప్రాధాన్యత రేవంత్ వార్నింగ్‌తో ఎమ్మెల్యేలు భాగమయ్యేనా

హంసకలం వార్త జూన్ 01

తెలంగాణ కాంగ్రెస్ పొలిటికల్ అఫైర్స్ కమిటీ (పీఏసీ) మీటింగ్ లో సీఎం రేవంత్ రెడ్డి తాజాగా చేసిన స్వీట్ వార్నింగులూ ఇప్పుడు ఆ పార్టీలో హాట్ టాపిక్ గా మారాయి

-పార్టీ కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు భాగమయ్యేనా!

తెలంగాణ కాంగ్రెస్ పొలిటికల్ అఫైర్స్ కమిటీ (పీఏసీ) మీటింగ్ లో సీఎం రేవంత్ రెడ్డి తాజాగా చేసిన స్వీట్ వార్నింగులూ ఇప్పుడు ఆ పార్టీలో హాట్ టాపిక్ గా మారాయి. పీసీసీ అధ్యక్షునిగా పార్టీని అధికారంలోకి తీసుకొచ్చి, సీఎం గా బాధ్యతలు చేపట్టిన రేవంత్ కు మూడేళ్ళకు పార్టీ, ప్రభుత్వం మధ్య కనీస సమన్వయంలేదనే జ్ఞానోదయం కలిగిందా? మూడేండ్లకే ఈ పరిస్థితి ఏర్పడితే రానున్న రోజుల్లో డేంజర్ బెల్స్ ఖాయమనే సంకేతాలు ఆయనలో భయాన్ని నెలకొల్పయా? అనే హాట్ హాట్ చర్చసాగుతోంది. మూడేండ్ల తర్వాతనైనా సీఎం రాష్ట్రంలో పార్టీకీ, ప్రజాప్రతినిధులకు మధ్య కనీస కోఆర్డినేషన్ లేని అంశాన్ని గుర్తించారా? అనే అనుమానాలూ, ప్రశ్నలు వ్యక్తమవుతుండగా ఇప్పటికైనా దిద్దుబాటు చర్యలు చేపట్టకుంటే రాబోయే రోజుల్లో పుట్టిమునగడం ఖాయమంటున్నారు.

-సీఎం మాటలతో జ్ఞానోదయం కలిగేనా?

సీఎం రేవంత్ వ్యాఖ్యలనూ, ఆయన చేసిన సూచనలను మంత్రులూ, ఎమ్మెల్యేలూ, కార్పొరేషన్ చైర్మన్ లూ ఆచరణలో పెడుతారా? అసలు చెవిన పెడుతారా? అనేదే ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. సీఎంగా రేవంత్ తన నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలూ, ప్రజాప్రతినిధులూ పార్టీకి కేటాయించాల్సిన సమయాన్ని నిర్ధేశించినప్పటికీ అమలూ, ఆచరణ ఇప్పుడు ముఖ్యమంటున్నారు.

-విజయానికి కష్టపడ్డ కేడర్ పై నిర్లక్ష్యం

పదేండ్ల ప్రతిపక్ష పార్టీగా పడిన ఇబ్బందులూ, ముఖ్యంగా క్షేత్ర స్థాయిలో పార్టీ కేడర్ పడిన అవస్థలు, భరించిన కేసులూ, వేధింపులూ, అవస్థలను భరించి కసితో పనిచేసిన వారి త్యాగాలనూ, బాధలను అన్నింటి మరిచిపోయీ ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా, ఎంపీలుగా, ఇతర ప్రజాప్రతినిధులుగా గెలువగానే, నామినేటెడ్ పోస్టులు దక్కగానే అంతా తమ గొప్ప అనే రీతిలో వ్యవహరిస్తున్నారనే విమర్శలు కాంగ్రెస్ పార్టీలో ఇప్పటికే ప్రారంభమైందీ. ముఖ్యంగా గెలిచిన ఎమ్మెల్యేల్లో మెజారిటీ వ్యక్తులు, కష్టపడ్డ కార్యకర్తల బాగోగులూ, అధికారంలో వారికి దక్కాల్సిన వాటాను విస్మరించి సీఎం రేవంత్ చెప్పినట్లుగా నియోజకవర్గాలను తమ జాగీరుగా భావిస్తూ పార్టీనీ, చివరికి ప్రజలను కూడా పట్టించుకోకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పార్టీ, పద్ధతి జాన్తానై తాము చెప్పినట్లు మీరు వినాలంటూ శాసిస్తున్న దుస్థితి నెలకొంది.

-పార్టీని పట్టించుకోవడం వదిలేశారు

దేశంలో కాంగ్రెస్ పార్టీ పై, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పైన, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పైన బీజేపీ, బీఆర్ఎస్ తదితర పక్షాలు చేస్తున్న విమర్శలు, ఆరోపణలను సైతం ఖండించలేని అచేతన స్థితికి చేరుకున్నారు. చివరికి తమ అధినేతలు సోనియా, రాహుల్ గాంధీని విమర్శించినా తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్న సందర్భాలున్నాయి. కొందరు ఎమ్మెల్యేలైతే వెనుకేసుకోవడానికి ఇస్తున్న ప్రాధాన్యత, పార్టీ కోసం శ్రమించిన కేడర్ ను కనీసం పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇక మంత్రులుగా ఆయా జిల్లాల్లో ఎమ్మెల్యేలూ, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులూ, పార్టీ మధ్య సమన్వయ కర్తలుగా ఉండాల్సిన స్థానంలో తమ నియోజకవర్గానికే పరిమితమవుతున్నారు. ఎక్కువ మంది ఎమ్మెల్యేలూ పార్టీ కార్యక్రమాలకూ దూరంగా ఉంటున్నారు. పార్టీ ఆఫీస్ లను కూడా సందర్శించడకుండా, పార్టీ కార్యక్రమానలు పట్టించుకోకుండా స్వంత ఇమేజన్ ను పెంచుకునే పనిలో ఉన్నారు. చివరికి సోషల్ మీడియాలో కూడా తమ డబ్బా తప్ప పార్టీ గురించి, ప్రభుత్వం గురించి ప్రచారం చేయకుండా తామూ, తమ కుటుంబం, రాబోయే రోజుల్లో తమ రాజకీయ వారసత్వం, తమ వర్గానికి పెద్ద పీట వేస్తూ పార్టీ కోసం శ్రమించిన వారిని విస్మరిస్తున్నారు. పార్టీ విభాగాల కంటే, ఆయా నేతల ఇమేజ్ పెంచే దిశగా పర్సనల్ సేన లను ఏర్పాటు చేసుకుని భజన బ్యాచ్ లను పెంచి పోషిస్తున్నారు. దీంతో స్వంత పార్టీలోనే ఎమ్మెల్యేల పైన వ్యతిరేకత పెరుగుతూ వస్తోంది. కొన్ని నియోజకవర్గాల్లోనైతే తమకు , తమ కుటుంబ సభ్యులకు తప్ప పార్టీలో మరో నాయకుడికి పదవి కూడా ఇవ్వకుండా తొక్కిపెడుతున్నారు. ఏ చిన్న అవకాశం ఇచ్చినా తమకు పోటీగా మారుతారని భావించి తొక్కిపెడుతున్నారు. ఈ అంశాలను ఆలశ్యంగానైనా సీఎం గుర్తించి క్లాస్ పీకారని భావిస్తున్నారు. అయితే పేనుకుట్టినట్లు కూడా లేని ఈ నాయకుల్లో సీఎం మాటలతో మార్పు వస్తుందా? అనేదే ఇప్పుడు అనుమానం. సరైన మానిటరింగ్, పర్యవేక్షణ లేకుండా ఏదో ఒక సందర్భంలో మాట్లాడితే అత్మసంతృప్తి తప్పితే పార్టీ పురోగమానానికి పెద్దగా ఉపయోగపడకపోవచ్చం టూ పెదవి విరుస్తున్నా

ఇకనైనా సమన్వయం సాగేనా?ఇప్పటి నుంచి పార్టీ కార్యక్రమాలూ, ప్రభుత్వ కార్యక్రమాల మధ్య సమన్వయం చేసుకుంటూ పార్టీ యాక్టివిటీలో భాగస్వామ్యమైతే కేడర్ లో నెలకొన్న నిరుత్సాహం తగ్గి, ఉత్సాహం నెలకొంటుందని భావిస్తున్నారు. అయితే కాంగ్రెస్ పార్టీలో ఎవరికివారే అన్నట్లు ఒకరి మాట మరొకలు వినకుండా ఏకపక్షంగా వ్యవహరించడం రివాజుగా మారింది. సీఎం చెప్పినట్లు ఆయన ముందుగా పార్టీ నాయకులకు అందుబాటులో ఉంటూ ఇంచార్జ్ మంత్రులు నెలకు మూడు రోజులు పార్టీ కార్యక్రమాల్లో భాగస్వామ్యమైతే నిజంగానే పార్టీలో కొంత మార్పుతో పాటు క్షేత్రస్థాయి పరిస్థితులు తెలుసుకునేందుకు దోహదం చేస్తుందంటున్నారు. తమను ఈ స్థాయికి తీసుకొచ్చి పార్టీని పట్టించుకోకపోవడం క్షమించరాని విషయమంటున్నారు పార్టీలోని కరుడుగట్టిన కేడర్. సీఎం రేవంత్ సూచనలూ, స్వీట్ వార్నింగులను మంత్రులూ, ఎమ్మెల్యేలూ, ప్రజా ప్రతినిధులూ ఏ మేరకు అమలు చేస్తారనేదే ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో చర్చనీయాంశంగా మారింది

# క్రీడలు

## ఐపీఎల్ 2026 అవార్డుల విజేతలు వీరే




అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియం వేదికగా ఆదివారం జరిగిన ఐపీఎల్ 2026 ఫైనల్ మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు అద్భుత విజయం సాధించింది. హోరాహోరీగా సాగిన తుది పోరులో గుజరాత్ టైటాన్స్‌పై ఐదు వికెట్ల తేడాతో గెలిచి, వరుసగా రెండోసారి ఐపీఎల్ ట్రోఫీని ముద్దాడి చరిత్ర సృష్టించిందిఅయితే, టైటిల్ గెలిచింది ఆర్సీబీనే అయినా, పోస్ట్-మ్యాచ్ ప్రజెంటేషన్‌లో అసలు సిసలు హీరోగా నిలిచింది మాత్రం రాజస్థాన్ రాయల్స్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ. ఈ 15 ఏళ్ల కుర్రాడు తన అసాధారణ ప్రదర్శనతో ఐపీఎల్ 2026 సీజన్‌లోని ప్రధాన వ్యక్తిగత అవార్డులన్నింటినీ కొల్లగొట్టి అందరి దృష్టినీ ఆకర్షించాడు. ఈ సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడిన వైభవ్ సూర్యవంశీ, ఐపీఎల్ చరిత్రలోనే ఒక అత్యంత అద్భుతమైన వ్యక్తిగత ప్రదర్శన కనబరిచాడు. వైభవ్ తో పాటు మీగతావారు ఏఏ అవార్డు గెలుచుకున్నారో తెలుకుందాం.అవార్డుల విజేతలు బౌలింగ్ విభాగంలో గుజరాత్ టైటాన్స్ పేస్ గుర్రం కగిసో రబడ ఆధిపత్యం ప్రదర్శించాడు. ఈ సీజన్‌లో మొత్తం 29 వికెట్లు పడగొట్టి, పర్పుల్ క్యాప్‌ను గెలుచుకున్నాడు. అతని సహచర బౌలర్ మహమ్మద్ సిరాజ్, టోర్నీలో అత్యధికంగా 172 డాట్ బాల్స్ వేసి ప్రత్యేక అవార్డును అందుకున్నాడు. గుజరాత్ టైటాన్స్ బ్యాటర్ సాయి సుదర్శన్ 75 ఫోర్లతో 'మోస్ట్ ఫోర్స్' అవార్డును దక్కించుకున్నాడు. కోల్‌కతా నైట్ రైడర్స్ ఫీల్డర్ మనీశ్ పాండే 'క్యాచ్ ఆఫ్ ది సీజన్' అవార్డు గెలుచుకున్నాడు. బ్యాక్‌వర్డ్ పాయింట్‌లో టిమ్ డేవిడ్‌ను ఔట్ చేసేందుకు గాల్లోకి ఎగిరి ఒంటిచేత్తో అద్భుతంగా అందుకున్న క్యాచ్‌కు ఈ పురస్కారం లభించింది. క్రీడా స్ఫూర్తి, నైతిక ప్రవర్తనకు ఇచ్చే 'ఫెయిర్ ప్లే అవార్డు'ను పంజాబ్ కింగ్స్ జట్టు కైవసం చేసుకుంది. పిచ్‌లు, గ్రౌండ్స్‌కు సంబంధించి హిమాచల్ ప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్, క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ బెంగాల్ అవార్డులు పొందాయి. ఐపీఎల్ 2026 అవార్డుల పూర్తి జాబితా: ఆరెంజ్ క్యాప్: వైభవ్ సూర్యవంశీ (రాజస్థాన్ రాయల్స్) 776 పరుగులు. పర్పుల్ క్యాప్: కగిసో రబడ (గుజరాత్ టైటాన్స్) 29 వికెట్లు మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్: వైభవ్ సూర్యవంశీ (రాజస్థాన్ రాయల్స్). ఎమర్జింగ్ ప్లేయర్ ఆఫ్ ది సీజన్: వైభవ్ సూర్యవంశీ (రాజస్థాన్ రాయల్స్). సూపర్ స్ట్రైకర్ ఆఫ్ ది సీజన్: వైభవ్ సూర్యవంశీ (237.31 స్ట్రైక్ రేట్). సూపర్ సిక్సెస్ ఆఫ్ ది సీజన్: వైభవ్ సూర్యవంశీ 72 సిక్సర్లు. మోస్ట్ ఫోర్స్: సాయి సుదర్శన్ (గుజరాత్ టైటాన్స్) 75 ఫోర్లు. మోస్ట్ డాట్ బాల్స్: మహమ్మద్ సిరాజ్ (గుజరాత్ టైటాన్స్) 172 డాట్ బాల్స్. క్యాచ్ ఆఫ్ ది సీజన్: మనీశ్ పాండే (కోల్‌కతా నైట్ రైడర్స్). ఫెయిర్ ప్లే అవార్డు: పంజాబ్ కింగ్స్

## ఆర్సీబీ డబుల్ డిలైట్

## -మళ్లీ బెంగళూరుకే ఐపీఎల్ కిరీటం

**ఫైనల్లో గుజరాత్‌పై ఘన విజయం**

**సత్తా చాటిన బౌలర్లు,కింగ్ కోహ్లీ**




రాయల్ చాలెంజర్స్ బెంగళూరు మరోసారి అద్భుతం చేసింది.! ఐపీఎల్‌లో అద్వితీయ ప్రదర్శనతో జూలు విదిల్చింది! అసమాన పోరాట పటిమతో మెగా టోర్నీలో రెండోసారి విజేతగా నిలిచింది. తొలి కప్పు కోసం ఏకంగా 18 ఏండ్లు సుదీర్ఘ పోరాటం చేసిన ఆ జట్టు.. రెండో ట్రోఫీని మాత్రం మరొక్క ఏడాదిలోనే సగర్వంగా ముద్దాడింది. గతేడాది విజయోత్సవాల విషాదం ఏడాదంతా వెంటాడుతున్నా, డిఫెండింగ్ చాంపియన్‌గా సొంతగడ్డ 'చిన్నస్వామి'లో ఫైనల్ ఆడే అవకాశం కోల్పోయినా బెంగళూరు ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. గుజరాత్ టైటాన్స్‌తో నరాలు తెగే ఉత్కంఠ తప్పదనుకున్న టైటిల్ పోరును.. తమ కసి, పట్టుదలతో పూర్తిగా ఏకపక్షం చేసింది. తొలి నాలుగు ఓవర్లలోనే ఓపెనర్లను పెవిలియన్‌కు పంపి ప్రత్యర్థి నడ్డి విరిచిన బౌలర్లు మ్యాచ్‌ను వన్ సైడ్ చేశారు. ఆ తర్వాత స్వల్ప లక్ష్య ఛేదనలో ఓపెనర్ వెంకటేశ్ అయ్యర్ ఖతర్నాక్ ఆరంభం ఇవ్వగా.. దానికి ఛేజ్ కింగ్ విరాట్ కోహ్లీ తన బ్యాట్ పవర్‌ను జత చేశాడు. బౌలర్లకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా విరాట్ సృష్టించిన విధ్వంసంతో ఆ చిన్న టార్గెట్‌ను ఆర్సీబీ ఆడుతూ పాడుతూ ఛేదించింది. లీగ్ దశ నుంచి సమష్టిగా కదం తొక్కుతూ టాపర్‌గా నిలిచిన బెంగళూరు అదే జోరును ఫైనల్లోనూ కొనసాగిస్తూ మెగా లీగ్‌లో టైటిల్‌ను విజయవంతంగా నిలబెట్టుకున్న మూడో జట్టు ముంబై, సీఎస్కే సరసన సగర్వంగా నిలిచింది. ఒకప్పుడు కప్పుల కరువుతో విమర్శలు ఎదుర్కొన్న చోటే సింహంలా గర్జించి.. వరుసగా రెండో ఏడాది విజేతగా అవతరించింది. తమను ఆరాధించే కోట్లాది మంది అభిమానుల ఆనందాన్ని రెండింతలు చేసింది. అహ్మదాబాద్: బెంగళూరు మరోసారి చాంపియన్ అయింది. టోర్నీ ఆరంభం నుంచే అదరగొడుతూ.. లీగ్ టాపర్‌గా నిలిచిన ఆ జట్టునే ఐపీఎల్ కిరీటం వరించింది. తమ మాదిరిగా రెండో ట్రోఫీ వేటలో ఉన్న మాజీ విజేత గుజరాత్ టైటాన్స్ దాని సొంతగడ్డపై చిత్తు చేసింది. ఆదివారం రాత్రి జరిగిన ఫైనల్ ఫైట్‌లో తమకు మద్దతుగా ఎరుపు వర్ణం జెండాలు, జెర్సీలతో నిండిన నరేంద్ర మోదీ స్టేడియంలో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో మెప్పించిన బెంగళూరు 5 వికెట్ల తేడాతో గుజరాత్‌ను ఓడించి టైటిల్ నిలబెట్టుకుంది. తొలుత రసిఖ్ సలామ్ దార్ (3/27), భువనేశ్వర్ (2/29), హేజిల్‌వుడ్ (2/37) బుల్లెట్లలాంటి బంతులు వేయడంతో గుజరాత్ 20 ఓవర్లలో 155/8 స్కోరు మాత్రమే చేసింది. వాషింగ్టన్ సుందర్ (37 బంతుల్లో 5 ఫోర్లతో 50 నాటౌట్) ఫిఫ్టీతో పోరాడాడు. అనంతరం కింగ్ కోహ్లీ (42 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సర్లతో 75 నాటౌట్) ముందుండి నడిపించడంతో చిన్న లక్ష్యాన్ని ఆర్సీబీ 18 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. వెంకటేశ్ అయ్యర్ (16 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 32) రాణించాడు. కోహ్లీకి ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది. టాప్ ధమాల్.. ఆదుకున్న సుందర్. ఆతిథ్య గుజరాత్ బ్యాటింగ్‌కు గుండెకాయలాంటి ఓపెనర్లను ఆరంభంలోనే వెనక్కపంపిన ఆర్సీబీ బౌలర్లు ప్రత్యర్థిని తక్కువ స్కోరుకే కట్టడి చేయడంలో సక్సెస్ అయ్యారు. టాస్ నెగ్గి బౌలింగ్ ఎంచుకున్న కెప్టెన్ పాటిదార్ నిర్ణయానికి పూర్తి న్యాయం చేశారు. రెడ్, బ్లాక్ సాయిల్‌తో కూడిన పిచ్‌ను అర్థం చేసుకొని సరైన లైన్ అండ్ లెంగ్త్‌తో బంతులు వేశారు. మూడో ఓవర్లో హేజిల్‌వుడ్ 141 కి.మీ వేగంతో సంధించిన షార్ట్ పిచ్ బాల్‌ను కెప్టెన్ గిల్ (10) పుల్ షాట్ ఆడబోయి పాటిదార్‌కు చిక్కగా.. తర్వాతి ఓవర్లోనే భువనేశ్వర్ బౌన్సర్‌ను వెంటాడిన సుదర్శన్ (12) కీపర్‌కు క్యాచ్ ఇచ్చాడు. సూపర్ ఫామ్‌లో ఉన్న ఓపెనర్లు 26 పరుగులకే డగౌట్ చేరిన తర్వాత టైటాన్స్ పుంజుకోలేకపోయింది. వరుసగా ఆరు ఓవర్లలో ఒక్క బౌండరీ కూడా ఇవ్వలేదు. రసిఖ్ వేసిన ఎనిమిదో ఓవర్లో భారీ షాట్‌కు ట్రై చేసిన నిశాంత్.. లైన్ వద్ద పడిక్కల్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు.దఅర్షద్ బౌలింగ్‌లో వరుసగా ఫోర్, సిక్స్‌తో మ్యాచ్ ముగించడంతో ఆర్సీబీ సంబరాలు మొదలయ్యాయి.

# బిజినెస్

## చివరి గంటలో అమ్మకాల ఒత్తిడి

## -భారీ నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్‌లు



భారతీయ స్టాక్ మార్కెట్ల కు సోమవారం నాటి ట్రేడింగ్ తీవ్ర నిరాశ మిగిల్చింది. ఉదయం పూట అంతర్జాతీయ మార్కెట్ల మద్దతుతో 500 పాయింట్లకుపైగా లాభపడి సరికొత్త రికార్డుల వైపు పయనిస్తుందనుకున్న దలాల్ స్ట్రీట్.. మధ్యాహ్నం మూడు గంటల సమయానికి పూర్తిగా బేరిష్ జోన్‌లోకి జారుకుంది. చివరి గంటలో అమ్మకాల ఒత్తిడి ఒక్కసారిగా తీవ్రం కావడంతో మార్కెట్లు తమ లాభాలన్నింటినీ కోల్పోయి భారీ నష్టాలను చవిచూశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఇ సెన్సెక్స్, ఎన్ఎస్ఇ నిఫ్టీ రెండు సూచీలు కూడా నష్టాల్లోనే స్థిరపడ్డాయి. ఉదయం 23,700 మార్కును తాకిన నిఫ్టీ ముగింపు సమయానికి పతనమై 23,400 స్థాయి కంటే దిగువన ముగిసింది. సెన్సెక్స్ 500 పాయింట్ల మేర పతనమైంది. మధ్యాహ్నం 3 గంటల తర్వాత మార్కెట్ ఇంతలా కుప్పకూలడానికి ప్రధానంగా పశ్చిమాసియా పరిణామాలు కారణమయ్యాయి. అమెరికా-ఇరాన్ మధ్య శాంతి చర్చలు జరుగుతున్నాయనుకుంటున్న తరుణంలోనే, ఇరు దేశాలు పరస్పరం దాడులు చేసుకోవడం అంతర్జాతీయంగా కలకలం రేపింది. ఇరాన్ రాడార్, డ్రోన్ కేంద్రాలపై అమెరికా దాడులు చేయగా.. భారతీయ స్టాక్ మార్కెట్లకు సోమవారం నాటి ట్రేడింగ్ తీవ్ర నిరాశ మిగిల్చింది. ఉదయం పూట అంతర్జాతీయ మార్కెట్ల మద్దతుతో 500 పాయింట్లకుపైగా లాభపడి సరికొత్త రికార్డుల వైపు పయనిస్తుందనుకున్న దలాల్ స్ట్రీట్.. మధ్యాహ్నం మూడు గంటల సమయానికి పూర్తిగా బేరిష్ జోన్‌లోకి జారుకుంది. చివరి గంటలో అమ్మకాల ఒత్తిడి ఒక్కసారిగా తీవ్రం కావడంతో మార్కెట్లు తమ లాభాలన్నింటినీ కోల్పోయి భారీ నష్టాలను చవిచూశాయి. దానికి ప్రతిగా కువైట్‌లోని అమెరికా ఎయిర్‌బేస్‌ను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ క్షిపణి దాడులు చేసినట్లు వచ్చిన వార్తలు ఇన్వెస్టర్లను భయాందోళనలకు గురిచేశాయి. ఈ యుద్ధ వాతావరణం కారణంగా అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ (ముడిచమురు) ధరలు బ్యారెల్‌కు 93 డాలర్ల మార్కును తాకడం ద్రవ్యోల్బణ భయాలను మరింత పెంచింది. దీనికి తోడు గత శుక్రవారం ఏకంగా 21,000 కోట్ల రూపాయల విలువైన షేర్లను విక్రయించిన విదేశీ పెట్టుబడిదారులు, ఈ రోజు మధ్యాహ్నం తర్వాత కూడా లార్జ్-క్యాప్ షేర్లలో తమ అమ్మకాలను ఉధృతం చేశారు.


## దేశంలో నిలకడగా జీఎస్టీ వసూళ్లు

**-మే నెలలో వసూళ్లు ఎన్ని లక్షల కోట్లంటే..!**




దేశంలో వస్తుసేవల పన్ను వసూళ్లు నిలకడగా కొనసాగుతున్నాయి. ఈ ఏడాది మే నెలలో స్థూల జీఎస్టీ వసూళ్లు రూ. 1.94 లక్షల కోట్లుగా నమోదైనట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ సోమవారం ప్రకటించింది. గత సంవత్సరం ఇదే నెలలో వసూలైన రూ. 1.88 లక్షల కోట్ల జీఎస్టీ వసూళ్ల తో పోలిస్తే ఇది 3.2 శాతం అధికమని తెలిపింది. రిఫండ్‌లను సర్దుబాటు చేసిన తర్వాత నికర జీఎస్టీ ఆదాయం రూ. 1.67 లక్షల కోట్లుగా ఉంది. ఇది గత ఏడాది ఇదే నెలతో పోలిస్తే 3.3 శాతం ఎక్కువ. ఏప్రిల్‌లో నమోదైన రికార్డు స్థాయి రూ. 2.43 లక్షల కోట్ల వసూళ్లతో పోలిస్తే మే నెలలో ఆదాయం తగ్గింది. అయితే ప్రతి సంవత్సరం ఆర్థిక సంవత్సరం ముగింపు తర్వాత మే నెలలో వసూళ్లు తగ్గడం సాధారణమేనని అధికారులు తెలిపారు. ఈసారి జీఎస్టీ వసూళ్లలో దిగుమతులు కీలక పాత్ర పోషించాయి. దేశీయ లావాదేవీల ద్వారా వచ్చిన జీఎస్టీ ఆదాయం 2.6 శాతం తగ్గి సుమారు రూ. 1.34 లక్షల కోట్లుగా నమోదు కాగా.. దేశంలో వస్తుసేవల పన్ను వసూళ్లు నిలకడగా కొనసాగుతున్నాయి. ఈ ఏడాది మే నెలలో స్థూల జీఎస్టీ వసూళ్లు రూ. 1.94 లక్షల కోట్లుగా నమోదైనట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ సోమవారం ప్రకటించింది. గత సంవత్సరం ఇదే నెలలో వసూలైన రూ. 1.88 లక్షల కోట్ల జీఎస్టీ వసూళ్ల తో పోలిస్తే ఇది 3.2 శాతం అధికమని తెలిపింది. దిగుమతులపై జీఎస్టీ వసూళ్లు 19.1 శాతం పెరిగి రూ. 59,654 కోట్లకు చేరుకోవడం గమనార్హం.దమే నెలలో మొత్తం రిఫండ్‌లు 2.6 శాతం పెరిగి రూ. 27,281 కోట్లుగా నమోదయ్యాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026-27) తొలి రెండు నెలల్లో (ఏప్రిల్-మే) స్థూల జీఎస్టీ వసూళు 6.2 శాతం వృద్ధితో రూ. 4.37 లక్షల కోట్లకు చేరాయి.

## అమ్మకాల ఒత్తిడికి ఆస్కారం!




ఆర్బీఐ ద్రవ్య సమీక్ష, మిడిల్ ఈస్ట్ ఉద్రిక్తతలు, వర్షపాతం అంచనాలు కీలకం. దేశీయ స్టాక్ మార్కెట్లను పశ్చిమాసియా సంక్షోభానికితోడు వర్షాభావ పరిస్థితుల భయాలు వెంటాడుతున్నాయి. అమెరికా-ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం అంచనాలతో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టినా.. ఎల్‌నినో ప్రభావంతో ఈసారి సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే వీలుందన్న వార్తలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీస్తున్నాయి మరి. ఈ కారణంగానే గత వారం చివరి రోజు ట్రేడింగ్‌లో సూచీలు భారీ నష్టాలకు లోనయ్యాయి. దీంతో అంతకుముందు వారంతో పోల్చితే గత వారం సెన్సెక్స్ 639.61 పాయింట్లు లేదా 0.84 శాతం పడిపోయి 74,775.74 దగ్గర నిలిచింది. నిఫ్టీ 171. 55 పాయింట్లు లేదా 0.72 శాతం కోల్పోయి 23,547.75 వద్ద స్థిరపడింది. ఇక ఈ వారం ఆర్బీఐ ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్ష ఉన్నది. ఇందులో నిర్ణయాలు బ్యాంకింగ్, ఆటో, రియల్టీ షేర్లను ఎక్కువగా ప్రభావితం చేయనున్నాయి. విజృంభిస్తున్న ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేసేందుకు కీలక వడ్డీరేట్లను పెంచితే సెల్లింగ్ ప్రెషర్ ఖాయమని చెప్పవచ్చు. తగ్గిస్తే పెట్టుబడులకు మద్దతు లభించినట్టే అనుకోవచ్చు. అలాగే మిడిల్ ఈస్ట్‌లో ఉద్రిక్తతలు పెరిగితే క్రూడాయిల్ రేట్లు పరుగులు పెట్టే అవకాశాలున్నాయి. దీంతో చమురు, సహజ వాయువు ఆధారిత రంగాల్లో అమ్మకాల ఒత్తిడి తప్పదు. అయితే శాంతి స్థాపనకు అడుగులు పడితే మార్కెట్లు పుంజుకోవచ్చు. తగ్గే ముడి చమురు ధరలు ఇందుకు దోహదం చేయగలవు. కానీ దేశీయ మార్కెట్లో పెరుగుతున్న పెట్రో ధరలు.. ద్రవ్యోల్బణాన్ని ఎగదోస్తున్నాయి. ఈ క్రమంలో సెంట్రల్ బ్యాంక్ రెపో రేటు పెరుగుతుందన్న అంచనాలే గట్టిగా వినిపిస్తున్నాయి. కాగా, జనవరి-మార్చికిగాను ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థలు ప్రకటించే ఆర్థిక ఫలితాల ప్రభావం కూడా మార్కెట్ ట్రేడింగ్‌పై ఒకింత ఉండనున్నది. అలాగే గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ, విదేశీ మదుపర్ల పెట్టుబడులు ప్రాధాన్యతను కలిగి ఉంటాయి. ఇటీవలికాలంలో రూపీ వాల్యూ పెరుగుతుండటం ఒకింత సానుకూల అంశంగానే చెప్పుకోవచ్చు.

# చిల్ అవుట్ మూడ్‌లో ప్రియాంకా చోప్రా



స్విమ్మింగ్ పూల్‌లో సరదాగా..
గ్లోబల్ అడ్వెంచరస్ ప్రాజెక్టుగా వస్తోన్న వారణాసిలో బాలీవుడ్ భామ ప్రియాంకా చోప్రా ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. మాలీవుడ్ స్టార్ యాక్టర్ పృథ్వీరాజ్ సుకుమార్ కీ రోల్‌లో నటిస్తున్నాడు. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉంది. లాంగ్ గ్యాప్ తర్వాత హైదరాబాద్‌లో ఇలా కనిపించి నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పుడీ ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. స్టార్ డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి-మహేశ్ బాబు కాంపౌండ్ నుంచి రాబోతున్న మోస్ట్ అవెయిటెడ్ ప్రాజెక్ట్ వారణాసి. గ్లోబల్ అడ్వెంచరస్ ప్రాజెక్టుగా వస్తోన్న ఈ మూవీలో బాలీవుడ్ భామ ప్రియాంకా చోప్రా ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. మాలీవుడ్ స్టార్ యాక్టర్ పృథ్వీరాజ్ సుకుమార్ కీ రోల్‌లో నటిస్తున్నాడు. మాధవన్, ప్రకాశ్ రాజ్ కీలకపాత్రల్లో నటిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉంది. ప్రియాంకా చోప్రా వారణాసి షూటింగ్ కోసం హైదరాబాద్‌లో ఉన్న విషయం తెలిసిందే. ఎప్పుడూ షూటింగ్ షెడ్యూల్స్‌తో బిజీబిజీగా గడిపే ఈ భామ కాస్త రిలాక్సింగ్ మూడ్‌లోకి వెళ్లిపోయింది. షూట్ బ్రేక్ టైంలో ఆదివారం సరదాగా స్విమ్మింగ్ చేసింది. బికినీలో ఓ వైపు హొయలుపోతూ.. మరోవైపు అందాలు ఆరబోస్తూ కుర్రకారుకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది.లాంగ్ గ్యాప్ తర్వాత హైదరాబాద్‌లో ఇలా కనిపించి నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పుడీ ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. వారణాసి చిత్రాన్ని శ్రీ దుర్గా ఆర్ట్స్ బ్యానర్‌పై కేఎల్ నారాయణ, ఎస్ఎస్ కార్తికేయ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీకి ఎంఎం కీరవాణి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రం రెండు పార్టులుగా రాబోతుంది. ఈ మూవీ ఫస్ట్ పార్ట్‌ను 2027 ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్టు ఇప్పటికే ప్రకటించింది టీం. సెకండ్ పార్ట్ 2029లో వస్తుందని వార్తలు రాగా.. రాజమౌళి టీం రాబోయే రోజుల్లో ఏదైనా క్లారిటీ ఇస్తుందేమో చూడాలి.

# అప్పుడే మరో సినిమా -గోపీచంద్ 34 షూటింగ్ షురూ..!




'భరత వర్ష : సాగా ఆఫ్ శూల' మూవీ సెట్స్‌పై ఉండగానే గోపీచంద్ 34గా రాబోతున్న మరో సినిమాను కూడా లాంచ్ చేశాడు. పాపులర్ స్టంట్ మాస్టర్ వీ వెంకట్ ఈ సినిమాతో డెరెక్టర్‌గా ఎంట్రీ ఇస్తుండటంతో మూవీ లవర్స్‌లో ఆసక్తి నెలకొంది. టాలీవుడ్ యాక్టర్ గోపీచంద్ ప్రస్తుతం 'భరత వర్ష : సాగా ఆఫ్ శూల' సినిమాలో నటిస్తున్నాడని తెలిసిందే. సంకల్ప్ రెడ్డి డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రం షూటింగ్ దశలో ఉంది. కాగా ఈ మూవీ సెట్స్‌పై ఉండగానే గోపీచంద్ 34గా రాబోతున్న మరో సినిమాను కూడా లాంచ్ చేశాడు. పాపులర్ స్టంట్ మాస్టర్ వీ వెంకట్ ఈ సినిమాతో డెరెక్టర్‌గా ఎంట్రీ ఇస్తుండటంతో మూవీ లవర్స్‌లో సినిమాపై ఆసక్తి నెలకొంది. మేలో లాంచ్ అయిన ఈ సినిమా షూటింగ్ ఫైనల్‌గా నేడు షురూ అయింది. ఈ చిత్రంలో అనార్కలి నాజర్ ఈ చిత్రంలో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. 70 ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై నిర్మిస్తున్న ఈ చిత్రానికి శ్యామ్ సీఎస్ మ్యూజిక్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నాడు. ఈ చిత్రానికి సంబంధించిన నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలపై త్వరలో క్లారిటీ ఇవ్వనున్నారు మేకర్స్. 'యాత్ర', 'ఆనందో బ్రహ్మ' వంటి విజయవంతమైన చిత్రాలను నిర్మించిన ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి. రీసెంట్‌గా విడుదలైన అనౌన్స్‌మెంట్ పోస్టర్ ప్రేక్షకుల్లో అంచనాలను పెంచేస్తుంది. మూవీ లవర్స్‌లో సినిమాపై ఆసక్తి నెలకొంది. మేలో లాంచ్ అయిన ఈ సినిమా షూటింగ్ ఫైనల్‌గా నేడు షురూ అయింది.మండుతున్న ఆకాశం, ఒక కొండపై గంభీరంగా సినిమా షూటింగ్ ఫైనల్‌గా నేడు షురూ అయింది. ఈ చిత్రంలో అనార్కలి నాజర్ ఈ చిత్రంలో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై నిర్మిస్తున్న ఈ చిత్రానికి శ్యామ్ సీఎస్ మ్యూజిక్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నాడు. ఈ చిత్రానికి సంబంధించిన నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలపై త్వరలో క్లారిటీ ఇవ్వనున్నారు మేకర్స్. 'యాత్ర', 'ఆనందో బ్రహ్మ' వంటి విజయవంతమైన చిత్రాలను నిర్మించిన ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై విజయ్ చిల్లా, శశి నిలబడిన బ్లాక్ పాంథర్ విజువల్స్ చూస్తుంటే, ఇంటెన్స్ మైథికల్ యాక్షన్ డ్రామాగా సినిమా ఉండబోతుందని స్పష్టమవుతోంది. జాతీయ అవార్డు గ్రహీత శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్‌గా, రామకృష్ణ-మౌనిక ప్రొడక్షన్ డిజైనర్లుగా వ్యవహరిస్తున్నారు.

# జపాన్ ట్రిప్‌తో మళ్లీ వార్తల్లో రష్మిక మందన్న



ఫోటోల్లో కనిపించిన 'స్పెషల్ పర్సన్'పై చర్చ! నేషనల్ క్రష్ రష్మిక మందన్న మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఇటీవల జపాన్‌లో జరిగిన ప్రతిష్టాత్మక యానిమే అవార్డ్స్ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె, అనంతరం చేసిన జపాన్ ట్రిప్‌కు సంబంధించిన ఫోటోలు, వీడియోలను అభిమానులతో పంచుకుంది. ఈ ఫోటోలు కేవలం ఆమె అందం, జపాన్ అందాల వల్లే కాదు.. అందులో కనిపించిన ఓ ప్రత్యేక వ్యక్తి కారణంగా కూడా వైరల్‌గా మారాయి. నేషనల్ క్రష్ రష్మిక మందన్న మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఇటీవల జపాన్‌లో జరిగిన ప్రతిష్టాత్మక యానిమే అవార్డ్స్ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె, అనంతరం చేసిన జపాన్ ట్రిప్‌కు సంబంధించిన ఫోటోలు, వీడియోలను అభిమానులతో పంచుకుంది. ఈ ఫోటోలు కేవలం ఆమె అందం, జపాన్ అందాల వల్లే కాదు.. అందులో కనిపించిన ఓ ప్రత్యేక వ్యక్తి కారణంగా కూడా వైరల్‌గా మారాయి.తన అధికారిక సోషల్ మీడియా ఖాతాలో జపాన్ పర్యటనకు సంబంధించిన పలు ఫోటోలు, వీడియోలను షేర్ చేసిన రష్మిక, "ఈ ఏడాది జపాన్ ట్రిప్ మరింత ప్రత్యేకంగా, సరదాగా సాగింది" అంటూ క్యాప్షన్ జోడించింది. ఈ పోస్ట్‌లో ఆమె జపాన్ వీధుల్లో విహరిస్తూ, అక్కడి సంస్కృతి, సంప్రదాయాలను ఆస్వాదిస్తూ కనిపించింది. ఈ ట్రిప్‌లో రష్మిక ధరించిన సంప్రదాయ జపనీస్ దుస్తులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. యుకాటా అనే సాంప్రదాయ వస్త్రధారణలో ఆమె ఎంతో అందంగా కనిపించింది. రంగురంగుల పూల డిజైన్లతో అలంకరించిన యుకాటాకు సరిపోయేలా ఆమె చేసిన స్టైలింగ్ అభిమానులను ఆకట్టుకుంది. జపాన్ సంప్రదాయాన్ని ప్రతిబింబించే ఈ లుక్ సోషల్ మీడియాలో ప్రశంసలు అందుకుంటోంది. ఫోటోలతో పాటు షేర్ చేసిన వీడియోల్లో రష్మిక తన చిలిపి స్వభావాన్ని మరోసారి చూపించింది. జపాన్‌లోని పర్యాటక ప్రాంతాల్లో సందడి చేస్తూ, సరదాగా గడిపిన క్షణాలను అభిమానులతో పంచుకుంది. ఆమె నవ్వులు, అల్లరి చేష్టలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. అయితే ఈ ఫోటోల్లో ఎక్కువ చర్చకు కారణమైన విషయం ఒకటి ఉంది. కొన్ని చిత్రాల్లో ఒక వ్యక్తి కనిపించినప్పటికీ, అతని ముఖం స్పష్టంగా కనిపించకుండా జాగ్రత్త పడినట్లు నెటిజన్లు గుర్తించారు. దీంతో సోషల్ మీడియాలో వెంటనే ఊహాగానాలు మొదలయ్యాయి. ఆ వ్యక్తి ప్రముఖ నటుడు విజయ్ దేవరకొండేనని అభిమానులు గుర్తించారు. ఈ నేపథ్యంలో రష్మిక పోస్ట్‌పై వేల సంఖ్యలో కామెంట్లు వచ్చాయి. "ముఖం కనిపించకపోయినా ఎవరో మాకు తెలుసు" అంటూ అభిమానులు సరదాగా స్పందిస్తున్నారు. జపాన్ ట్రిప్ ఫోటోల కంటే వాటిలో కనిపించిన ఆ వ్యక్తిపైనే ఇప్పుడు సోషల్ మీడియాలో ఎక్కువ చర్చ జరుగుతోంది.

# అలియా భట్‌తో గొడవలంటూ ప్రచారం



సోషల్ మీడియా రూమర్లపై బాబీ డియోల్ ఫైర్! బాలీవుడ్ సీనియర్ నటుడు బాబీ డియోల్ ప్రస్తుతం తన కెరీర్‌లో దూసుకుపోతున్నాడు. విలన్ పాత్రల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆయన, వరుసగా భారీ ప్రాజెక్టులతో ప్రేక్షకులను అలరిస్తున్నారు. ముఖ్యంగా 'యానిమల్', 'కంగువ', 'హరిహర వీరమల్లు' వంటి చిత్రాలతో దేశవ్యాప్తంగా మంచి క్రేజ్ సంపాదించిన బాబీ డియోల్, తాజాగా తనపై మరియు హీరోయిన్ అలియా భట్‌పై వస్తున్న సోషల్ మీడియా ప్రచారాలపై ఘాటుగా స్పందించారు. అలియా భట్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న స్పై యాక్షన్ థ్రిల్లర్ 'ఆల్ఫా' చిత్రంలో బాబీ డియోల్ కీలక పాత్ర పోషిస్తున్నారు. అయితే ఈ సినిమా షూటింగ్ సమయంలో అలియా భట్, బాబీ డియోల్ మధ్య విభేదాలు తలెత్తాయని, ఇద్దరి మధ్య గొడవలు జరిగాయని సోషల్ మీడియాలో పలు కథనాలు వైరల్ అయ్యాయి. ఈ ప్రచారం అభిమానుల్లో కూడా ఆసక్తిని రేకెత్తించింది. ఈ నేపథ్యంలో ప్రముఖ టెలివిజన్ కార్యక్రమంలో పాల్గొన్న బాబీ డియోల్, ఈ వార్తలను పూర్తిగా ఖండించారు. తనకు సంబంధించిన ఈ రూమర్‌ను మొదట చూసినప్పుడు తానే ఆశ్చర్యపోయానని చెప్పారు. ఒక స్నేహితుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న కథనాన్ని తనకు పంపించగా, దాన్ని చూసి నవ్వు వచ్చిందని పేర్కొన్నారు. జనాలకు ఖాళీ సమయం ఎక్కువైందనుకుంటా. అందుకే కూర్చొని లేని కథలను సృష్టిస్తున్నారు. నిజంగా అలాంటివి ఎలా ఆలోచిస్తారో కూడా అర్థం కావడం లేదు అంటూ బాబీ డియోల్ అసహనం వ్యక్తం చేశారు. అలియా భట్ గురించి మాట్లాడిన ఆయన, ఆమెను అత్యంత ప్రతిభావంతమైన నటిగా అభివర్ణించారు. అలియాతో కలిసి పనిచేయడం చాలా మంచి అనుభవం. ఆమె తన పాత్ర కోసం ఎంత కష్టపడుతుందో సెట్స్‌లో దగ్గరగా చూసాను. ముఖ్యంగా యాక్షన్ సన్నివేశాల కోసం ఆమె చేసిన ప్రిపరేషన్ నిజంగా ఆశ్చర్యపరిచింది అని ప్రశంసించారు. అలాగే తాను ఇటీవల రణ్‌బీర్ కపూర్‌తో కలిసి 'యానిమల్' చిత్రంలో నటించానని, ఇప్పుడు అలియా భట్‌తో కలిసి పనిచేసే అవకాశం రావడం తన అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. కొందరు లేని విషయాలను సృష్టించి ప్రచారం చేస్తుంటారు. ఒక రూమర్ ముగియకముందే మరో కొత్త కథ మొదలవుతుంది.


# 'పెద్ది'లో జాన్వీ కపూర్ 'అచ్చియమ్మ'పాత్రే హైలైట్

**- 'అచ్చియమ్మ' ఎంట్రీకి హీరో రేంజ్ ఎలివేషన్!**



మెగా పవర్ స్టార్ రామ్‌చరణ్ హీరోగా, దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'పెద్ది' విడుదలకు సమయం దగ్గరపడుతున్న కొద్దీ సినిమాపై అంచనాలు మరింత పెరుగుతున్నాయి. ఉత్తరాంధ్ర గ్రామీణ నేపథ్యంతో రూపొందుతున్న ఈ భారీ స్పోర్ట్స్ డ్రామా జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే విడుదలైన టీజర్, పాటలు, ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై భారీ హైప్ తీసుకురాగా, తాజాగా హీరోయిన్ జాన్వీ కపూర్ చేసిన వ్యాఖ్యలు మరింత ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. సినిమా ప్రమోషన్లలో భాగంగా జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో జాన్వీ కపూర్ తన పాత్ర గురించి పలు ఆసక్తికర విషయాలను వెల్లడించింది. ఈ చిత్రంలో ఆమె 'అచ్చియమ్మ' అనే పల్లెటూరి యువతి పాత్రలో కనిపించనుంది. అయితే సాధారణ గ్రామీణ యువతి పాత్రల మాదిరిగా కాకుండా, పూర్తిగా భిన్నమైన వ్యక్తిత్వంతో ఈ పాత్ర రూపొందిందని జాన్వీ తెలిపింది. సినిమాల్లో సాధారణంగా పల్లెటూరి అమ్మాయిలను అమాయకంగా, సిగ్గుపడే స్వభావంతో చూపిస్తారని, కానీ 'అచ్చియమ్మ' పాత్ర అలాంటిది కాదని ఆమె చెప్పింది. తనకు తాను నిర్ణయాలు తీసుకుంటూ, చుట్టూ ఉన్న వారిని ప్రభావితం చేసేలా ఉంటుందని పేర్కొంది. కాస్త గర్వం, ఆధిపత్యం కలిగిన యువతిగా ఈ పాత్ర కనిపిస్తుందని వివరించింది. కథలో ఈ పాత్రకు మంచి ప్రాధాన్యం ఉండటంతో పాటు, ప్రేక్షకులను ఆకట్టుకునే ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయని వెల్లడించింది. అంతేకాదు, ఈ సినిమాలో తన ఎంట్రీ సీన్ గురించి కూడా జాన్వీ ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. దర్శకుడు బుచ్చిబాబు తన పాత్రను చాలా ప్రత్యేకంగా డిజైన్ చేశారని తెలిపింది. సాధారణంగా స్టార్ హీరోలకు ఇచ్చే మాస్ ఎలివేషన్లు, భారీ ఇంట్రడక్షన్ సన్నివేశాలు ఎలా ఉంటాయో, అదే తరహాలో 'అచ్చియమ్మ' ఎంట్రీని కూడా రూపొందించారని చెప్పింది. ఈ సీన్ థియేటర్లలో ప్రేక్షకుల నుంచి విజిల్స్, చప్పట్లు అందుకునే అవకాశం ఉందని ఆమె నమ్మకం వ్యక్తం చేసింది.ముఖ్యంగా గ్రామీణ నేపథ్యం, భాష, హావభావాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు వెల్లడించింది. ఇక 'పెద్ది' చిత్రంలో రామ్‌చరణ్ పూర్తిగా కొత్త లుక్‌లో కనిపించనున్నారు. గ్రామీణ క్రీడల నేపథ్యంలో సాగే ఈ కథలో ఆయన మాస్ మరియు రస్టిక్ అవతార్ అభిమానులను ఆకట్టుకుంటుందని చిత్రబృందం చెబుతోంది. ఇప్పటికే విడుదలైన పోస్టర్లలో రామ్‌చరణ్ లుక్‌కు మంచి స్పందన లభించింది.ఈ భారీ చిత్రంలో కన్నడ స్టార్ శివరాజ్ కుమార్, సీనియర్ నటుడు జగపతి బాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పిస్తున్నాయి. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందించడం సినిమాకు మరో ప్రధాన ఆకర్షణగా మారింది.హీరోయిన్ పాత్రకు ఇలాంటి భారీ ఎలివేషన్ ఇవ్వడం చాలా అరుదైన విషయమని, అందుకే ఈ పాత్ర తనకు ఎంతో ప్రత్యేకమైందని జాన్వీ పేర్కొంది. షూటింగ్ సమయంలో కూడా ఈ పాత్రను ఎంతో ఆస్వాదిస్తూ నటించానని చెప్పింది. ముఖ్యంగా గ్రామీణ నేపథ్యం, భాష, హావభావాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు వెల్లడించింది.

# 'పెద్ది' రిలీజ్ వివాదానికి ముగింపు



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా దర్శకుడు బుచ్చిబాబు సన తెరకెక్కించిన భారీ చిత్రం 'పెద్ది' విడుదలకు ముందు నెలకొన్న అనిశ్చితి ఎట్టకేలకు తొలగిపోయింది. గత కొన్ని రోజులుగా టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారిన థియేటర్ల వివాదానికి తెరపడింది. ముఖ్యంగా దిల్ రాజు సంస్థకు చెందిన ఎస్వీసీ థియేటర్లలో 'పెద్ది' విడుదల అవుతుందా లేదా అనే సందేహాలకు ఇప్పుడు స్పష్టత వచ్చింది. తెలుగు సినీ పరిశ్రమలో నిర్మాతలు, ఎగ్జిబిటర్ల మధ్య రెంటల్ సిస్టమ్, పర్సెంటేజ్ సిస్టమ్ అంశాలపై నెలకొన్న విభేదాలు 'పెద్ది' విడుదలపై ప్రభావం చూపుతాయనే ప్రచారం జరిగింది. మరోవైపు ఎస్వీసీ డిస్ట్రిబ్యూషన్ మరియు మైత్రి డిస్ట్రిబ్యూషన్ మధ్య ఉన్న విభేదాల కారణంగా కూడా సినిమా విడుదలపై అనేక ఊహాగానాలు వినిపించాయి. ఆదివారం విడుదల చేసిన నైజాం థియేటర్ల తొలి జాబితాలో ఎస్వీసీ థియేటర్ల పేర్లు లేకపోవడంతో ఈ ప్రచారానికి మరింత బలం చేకూరింది.ఇప్పటివరకు మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన చిత్రాల్లో నైజాం ప్రాంతంలో ఇంత భారీ స్థాయిలో విడుదల అవుతున్న సినిమా 'పెద్ది'నే అని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. గతంలో మైత్రి సంస్థ సినిమాలకు లభించని స్థాయిలో స్క్రీన్లు ఈ చిత్రానికి దక్కినట్లు తెలుస్తోంది. దీంతో విడుదల రోజు నుంచే భారీ వసూళ్లు నమోదు చేసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. మరోవైపు తెలంగాణలో టికెట్ ధరల పెంపు, అదనపు షోల అనుమతుల కోసం నిర్మాతలు ప్రభుత్వాన్ని ఆశ్రయించినట్లు సమాచారం. ఈ విషయంపై ప్రభుత్వం నుంచి అనుమతులు లభిస్తే 'పెద్ది'కి మరింత భారీ అడ్వాంటేజ్ లభించే అవకాశం ఉంది.ముఖ్యంగా మొదటి వారం వసూళ్లపై దీని ప్రభావం స్పష్టంగా కనిపించనుంది. ఈ ఏడాది వేసవి సీజన్‌లో టాలీవుడ్ నుంచి పెద్ద సినిమా లేకపోవడంతో బాక్సాఫీస్ ఆశించిన స్థాయిలో సందడి చేయలేకపోయింది.

Edited, Printed,Published and Owned by Vadla Madhusudhan chary, H. NO. 42-397 Anjaiah- Nagar, Behind Hanuman temple, ALLWYN COLONY Medchal Malkajgiri, Telangana 500037, Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, Cell.No.9966555449